ముగ్గురు మున్సిపల్ ఉద్యోగులకు మెమో

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీకి ఆస్తిపన్ను బకాయిపై వి.సత్యనారాయణ అనే వ్యక్తి అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ చేసుకున్న అర్జీపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపకుండా నిర్లక్ష్యం వహించిన మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్లు ముజఫర్‌బేగం, కె.స్వర్ణలతలకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మెమోలు జారీ చేశారు. ఎండార్స్‌మెంట్ ఇవ్వనందున ఆ పన్ను బకాయిదారుడు మున్సిపాలిటీకి రూ.70,57,933 చెల్లించకుండా హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారని, దీనిపై రెండు రోజుల్లో సంజాయిషి ఇవ్వకుంటే చర్యలు తీసుకోవాల్సివస్తుందని కమిషనర్ ఆ ముగ్గురికి వెల్లడించారు.

ఆక్రమణలు తొలగించాల్సింది రెవెన్యూశాఖే

● ఇరిగేషన్‌పై ఫిర్యాదు చేసినందుకు..

పిటిషన్‌దారుకు హైకోర్టు అక్షింతలు



(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెరువులు, వాగులు, వంకలు భారీ ఎత్తున కబ్జాకు గురయ్యాయి. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు అవి మాది కాదు, ఇరిగేషన్ అధికారులది అని చెబుతూ రెవెన్యూశాఖ తప్పించుకుంటూ వచ్చేది. అయితే ఆక్రమణల తొలగింపు రెవెన్యూదని హైకోర్టు తీర్పునిచ్చింది. దీంతో ఇక ఇరిగేషన్‌పై రెవెన్యూ నెపం వేసి తప్పించుకునే అవకాశం ఉండదు. అట్లూరు మండలంలోని పుట్టాయపల్లె చెరువు ఆక్రమణకు గురైందని గ్రామానికి చెందిన మన్నెం సిద్ధారెడ్డి, బీరం శివరామిరెడ్డి మరికొందరు 2023లో హైకోర్టును ఆశ్రయించారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ప్రతివాదులుగా చేర్చారు. ఆక్రమణలు తొలగించాల్సిందిగా న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఆక్రమణలు తొలగించకపోవడంతో.. పిటిషన్‌దారులు కంటెంట్ కోర్టు కింద అప్పటి ఇరిగేషన్ ఈఈ ప్రస్తుత తెలుగుగంగ ఎస్ఈ, ఇరిగేషన్ అధికారులపై కోర్టుకు వెళ్లారు. దీంతో గురువారం తెలుగుంగ ఎస్ఈ వెంకట్రామయ్య కోర్టుకు హాజరయ్యారు. దీనిపై వాదనలు జరిగాయి. 188 జీవో ప్రకారం ఆక్రమణలు తొలగించాల్సింది గ్రామ, మండల రెవెన్యూ అధికారులే అని ఎస్ఈ వివరించారు. దీంతో ఇరిగేషన్ అధికారులను బాధ్యులను చేయడం పట్ల న్యాయస్థానం పిటిషన్‌దారులను మందలించడంతో పాటు జరిమానా విధించింది. ఈ మేరకు పిటిషన్ దారులు జరిమానా రూ.2వేలను ఎస్ఈ వెంకట్రామయ్యకు అందజేశారు. హైకోర్టు తీర్పుతో చెరువులు, కుంటల ఆక్రమణల తొలగింపు ఇక తమది కాదని తప్పించుకునేందుకు రెవెన్యూ శాఖకు ఉండదు.

భర్త స్థానంలో భార్యకు పింఛన్

● జిల్లాలో 3,585 మందికి అవకాశం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన పింఛన్‌దారుడి భార్యకు పింఛన్ మంజూరు చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్యకాలంలో పింఛన్ పొందుతూ మరణించిన వారి స్థానంలో భార్యలు పింఛన్ పొందేందుకు అవకాశం కలిగింది. ఇప్పటికే 2024 నవంబరు 1 నుంచి పింఛన్‌దారుడు మృతిచెందితే ఆయన భార్యకు పింఛన్ మంజూరు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులు తమకు కూడా పింఛన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఈ మేరకు అనుమతిస్తూ గురువారం ప్రభుత్వ కార్యదర్శి కరుణ వాకాటి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలో 3,585 మంది వితంతు పింఛన్లు పొందే అవకాశం లభించింది. కాగా.. జిల్లాలో మే నెలకు సంబంధించి 2,5,689 మందికి రూ.110.64కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఈ మేరకు పింఛన్ పంపిణీకి తగిన చర్యలు తీసుకోవాలంటూ డీఆర్‌డీఏ పీడీ డి.ఆనంద్‌నాయక్ ఆదేశాలు జారీచేశారు.

బాధ్యతలు చేపట్టిన ఇంటర్ ఆర్జేడీ, డీఐఈఓ


కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ కడప ఆర్జేడీ, డీఐఈఓ బాధ్యతలు చేపట్టారు. గురువారం ఇంటర్ ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీగా ఎ.శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన ఆర్జేడీగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆర్జేడీగా కొనసాగుతున్న రవి రాయచోటి డీఐఈఓగా బదిలీ అయ్యారు. కాగా.. ఎన్టీఆర్ జల్లా పాయికాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సీహెచ్ సత్యనారాయణరెడ్డి కడప డీఐఈఓగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇన్‌చార్జి డీఐఈఓగా విధులు నిర్వహిస్తున్న ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య కడప ఆర్ఐఓగా కొనసాగనున్నారు.

పన్నుపోటు



జగన్ హయాంలో జనంపై ఎడాపెడా పన్నులు బాదేశారు. అప్పట్లో జగన్ బాదుడుపై జనాల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ముఖ్యంగా అర్బన్ ప్రాంతాలైన కార్పొరేషన్, మున్సిపాలిటీలలో చెత్త పన్ను, ఆస్తి పన్ను పెంపు తీవ్ర వ్యతిరేకతను తీసుకువచ్చింది. చెత్తపన్ను రద్దు చేసినట్లు కార్పొరేషన్, మున్సిపాలిటీలలో ఆస్తిపన్ను కూడా చంద్రబాబు సర్కారు తొలగించి పాత విధానం అమలు చేస్తుందని భావిస్తూ వచ్చారు. అయితే అది ఇంకా జరగలేదు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో మళ్లీ 10 నుంచి 15 శాతం మేర ఆస్తి పన్ను పెరిగింది. ఈ భారాన్ని ఇళ్ల యజమానులు అద్దెఇళ్లపై మోపేస్తున్నారు. పన్నుపోటు చివరకు పేదలపైనే పడుతోంది.

● నాలుగేళ్లలో రెట్టింపైన ఆస్తిపన్ను
● ఈ ఏడాదీ ఆస్తిపన్ను పెంపు
● జిల్లావాసులపై రూ.50 కోట్ల మేర భారం
● 15 శాతం పెరిగిన ఇంటి అద్దెలు
● చంద్రబాబు సర్కారులోనూ.. వైసీపీ పన్ను విధానమే


కడప నగర వ్యూ

● ప్రొద్దుటూరులో..

సంవత్సరం	డిమాండ్ (రూ.కోట్లలో..)
2021-22	14.46
2022-23	17.34
2023-24	18.51
2024-25	21.04
2025-26	22.62

● కడప కార్పొరేషన్‌లో

సంవత్సరం	డిమాండ్ (రూ.కోట్లలో..)
2021-22	61.99
2022-23	74.58
2023-24	73.99
2024-25	93.60
2025-26	99.18

మున్సిపాలిటీల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నుల డిమాండ్..

మున్సిపాలిటీ	మొత్తం అసెస్‌మెంట్లు	డిమాండ్ రూ.కోట్లలో..
కడప కార్పొరేషన్	1,02,330	99.18
ప్రొద్దుటూరు	34,498	34.41
పులివెందుల	23,249	8.65
బద్వేలు	25,116	9.45
జమ్మలమడుగు	11,935	4
ఎర్రగుంట్ల	11,505	5.01
మైదుకూరు	13,488	4.98
కమలాపురం	5,603	1.13
మొత్తం	**2,27,724**	**166.81**

(కడప-ఆంధ్రజ్యోతి): అద్దె విలువ ప్రామాణికంగా జోన్ల వారీగా ఉన్న ఆస్తి పన్ను విధానాన్ని జగన్ ప్రభుత్వం పూర్తిగా మార్చివేసింది. మార్కెట్ విలువ ఆధారంగా ఆస్తి పన్ను విధించింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఈ విధానాన్ని తీసుకు వచ్చింది. ఏటా 15 శాతం పెంచేలా జీవో జారీ చేసింది. దీంతో భారీగా పన్నులు పెరిగాయి. చంద్రబాబు సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత చెత్త పన్నును రద్దు చేశారు. వైసీపీ హయాంలో అమలులో ఉన్న ఆస్తి పన్ను విధానం అలానే కొనసాగుతోంది. ఈ సారి కూడా 15శాతం పన్ను పెరిగింది. ఈ నెల 1 నుంచి ఇది అమలులోకి వచ్చింది. జిల్లా వాసులపై ఈ ఏడాది దాదాపు రూ.50కోట్ల మేర పన్నుల భారం పడనుంది. ఆస్తి విలువ ఆధారంగా మార్కెట్ విలువకు సమానం అయ్యే వరకు పన్ను పెరగనుంది. ఈ పన్నుల భారం గృహయజమానులపై పడుతుంది. ఈ భారాన్ని కొందరు యజమానులు అద్దెదారులపై మోపుతున్నారు.

అమ్మో భారం

జగన్ సర్కారు రాకముందు కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో అద్దె విలువ ఆధారంగా ఆస్తి పన్ను విధించేవారు. 1997 నుంచి భవన నిర్మాణ కొలతలు తీసుకుని పన్నులు వేసేవారు. అయితే జగన్ సర్కారు పాత విధానానికి స్వస్తి పలికి రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా పన్నులకు శ్రీకారం చుట్టింది. ఆ స్థలం మార్కెట్ విలువ బట్టి పన్ను విధిస్తూ వచ్చింది. దీంతో ఒక్కసారిగా పన్నుల రూపురేఖలే మారిపోయాయి. ఎంతగా అంటే 2020-21లో కడప కార్పొరేషన్‌లో అన్ని రకాల పన్నులు కలుపుకుని రూ.40 కోట్లు లోపే ఉండేది. ఇప్పుడది రూ.90 కోట్లకు చేరింది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో కూడా రూ.10కోట్ల మేర పన్ను ఉండేది. ఇప్పుడది రూ.22కోట్లకు చేరింది. జిల్లాలో కడప కార్పొరేషన్‌తో పాటు ప్రొద్దుటూరు మున్సిపా లిటీ, బద్వేలు, పులివెందుల, మైదుకూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, కమలాపురం నగర పంచాయతీలున్నాయి. ఈ పట్టణ ప్రజలందరిపైనా మార్కెట్ విలువ ఆధారంగా పన్ను పెంపు ప్రభావం ఎక్కువగా ఉంది. జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో కలిపి ఈ ఆర్థిక సంవత్సరం పన్నుల డిమాండ్ రూ.166.81 కోట్లుగా అధికారులు ప్రకటించారు. అయితే అద్దెవిలువ ప్రామాణికంగా ఆస్తిపన్నులు ఉండి ఉంటే జిల్లా ప్రజలపై రూ.50 కోట్ల భారం తగ్గేదని పలువురు పేర్కొంటున్నారు.

అద్దెల భారం

పిల్లల చదువులు, ఉపాధి కోసం ప్రజలు పట్టణాల బాట పడుతున్నారు. వీరంతా అద్దె ఇళ్లల్లో ఉంటున్నారు. చాలీచాలని వేతనాలతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మార్కెట్ విలువ ఆధారంగా ఆస్తి పన్ను పెంచడంతో గృహయజమానులు వెంటనే ఇంటి అద్దెలు పెంచేశారు. ఈ నెల నుంచే 15 శాతం అద్దెలు పెంచడం గమనార్హం.

పన్నుల భారం ఇలా..

జిల్లాలో కడప కార్పొరేషన్ తరువాత మరో పెద్ద పట్టణం ప్రొద్దుటూరు ఉంది. ఈ రెండు ఊర్లల్లో వైసీపీ హయాంలో మార్కెట్ విలువ ఆధారంగా వచ్చిన ఆస్తి పన్నులను పరిశీలిస్తే ప్రజలపై ఎంత భారం పడిందో ఇట్టే అర్థమవుతుంది.

ఎంఎస్ఎంఈలతో ఆర్థిక పరిపుష్టి

● రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితి సింగ్, ఎమ్మెల్యేలు ఆర్. మాధవి, పుత్తా కృష్ణచైతన్య రెడ్డి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)తోనే రాష్ట్ర ఆర్థిక పరిపుష్టి సాధ్యమని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లాలో ఎంఎస్ఎంఈ, సెర్ప్ కార్యకలాపాలపై గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్, ఎమ్మెల్యేలతో కలసి సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో పారిశ్రామికరంగంపై అవగాహన పెంచి పరిశ్రమల స్థాపనకు పెట్టుబడి సాయం అందిస్తోందన్నారు. దేశంలో రూ.10 లక్షల నుంచి రూ.120 కోట్ల పెట్టుబడితో నిర్వహించే పరిశ్రమను సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల కింద చేర్చారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే భారీ పరిశ్రమలతో పాటు ఎంఎస్ఎంఈల పురోభివృద్ధి కూడా ముఖ్యమన్నారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రతిఒక్కరూ ఏదో ఒకరంగంలో స్వయం ఉపాధి పొందుతున్నారంటే జిల్లా యంత్రాంగం కృషి ఎంతో ఉందని మంత్రి అభినందించారు. జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలో జరుగుతున్న మహిళాభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. పీఎంఈజీఈ, పీఎం విశ్వకర్మ వంటి పథకాల ద్వారా ఎంటర్‌ప్రెన్యూర్ షిప్‌ను ప్రోత్సహిస్తున్నామన్నారు. జిల్లా నుంచి ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్స్, బెరైటీస్, బేరియం క్లోరైడ్ ఉత్పత్తులు అధికంగా ఎగుమతులు జరుగుతున్నాయన్నారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే ముఖ్యమంత్రి ఆకాంక్ష అన్నారు. ఆ దిశగా మహిళలను, యువతను జిల్లా అధికారులు ప్రోత్సహించాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం కింద 28 భారీ పరిశ్రమలు నడుస్తున్నాయని, దాదాపు 16,208 మంది ఉపాధి పొందుతున్నారని అన్నారు. కొత్త యూనిట్ల స్థాపనకు జిల్లాలో ఇప్పటి వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అందిన 3,526 దరఖాస్తులకు గాను 3426 ఆమోదం పొందాయన్నారు. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి మాట్లాడుతూ స్థానికంగా ఉన్న ఇండస్ట్రియల్‌లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, మ్యాన్‌పవర్ చాలా అవసరం ఉందన్నారు. జమ్మలమడుగు, కమలాపురం ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, చైతన్య రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి స్వయం సహాయక సంఘాల వ్యవస్థను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇదేంది గురూ..!

● రిమ్స్‌లో అమ్మకానికి మెడికల్ సర్టిఫికెట్లు
● ఉపాధ్యాయుల బదిలీల కోసం ప్రత్యేక మెడికల్ క్యాంపు
● సర్టిఫికెట్ల కోసం ఇప్పటికే కొందరివద్ద వసూళ్లు



(కడప-ఆంధ్రజ్యోతి): కడప సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో కొందరు అధికారుల తీరు వివాదాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. ముఖ్యంగా డబ్బులు ఇస్తే చాలు.. సకలాంగులకు కూడా వికలాంగుల సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని ప్రచారం సాగుతోంది. ఇక పింఛన్ల కోసం వచ్చేవారి నుంచి ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.20వేల నుంచి రూ.30వేలు తీసుకుని భారీగా సర్టిఫికెట్లు మంజూరు చేశారు. సదరం క్యాంపు వచ్చిందంటే చాలు అక్కడ పనిచేసే కొందరు వైద్యులకు పండగ అంటారు. అలా బోగస్ సర్టిఫికెట్లతో కొందరు ఉద్యోగాలు సంపాదిస్తే మరికొందరు ప్రభుత్వం నుంచి పింఛన్లు తీసుకుంటున్నారు. ఈ దుమారం సద్దుమణగక ముందే ఇప్పుడు ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులో కూడా అంగట్లో సరుకుల్లా బేరం పెట్టి సర్టిఫికెట్లు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.20వేల నుంచి రూ.30వేలు వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఓ వైద్యాధికారి వసూళ్లు చేసి అందరికీ పంచేలా ఏర్పాటు చేసుకున్నారని అంటున్నారు. వచ్చే నెలలో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. బదిలీలను పారదర్శకంగా నిర్వహించేందుకు గాను టీచర్ల బదిలీల నియంత్రణ చట్టం-25ను అమలులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా అర్హులైన దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిపీడితుల కోసం మెడికల్ క్యాంపు నిర్వహించి వారి వికలత్వం, దీర్ఘకాలిక వ్యాధిని నిర్ధారిస్తూ సర్టిఫికెట్ జారీచేస్తారు. ఇందుకోసం గురువారం నుంచి శుక్రవారం వరకు ఉమ్మడి వైఎస్సార్‌కడప జిల్లాలోని ఉపాధ్యాయులకు రిమ్స్‌లో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఇందుకోసం మెడికల్ బోర్డు కూడా ఏర్పాటు చేశారు. గురువారం 195 మంది ఉపాధ్యాయులు క్యాంపునకు హాజరయ్యారు. సర్వజన ఆసుపత్రిలో న్యూరోకు సంబంధించిన నిపుణులు లేకపోవడంతో పదిమందిని తిరుపతి స్విమ్స్‌కు రెఫర్ చేశారు. టీచర్లందరికీ మెడికల్ క్యాంపులో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు.

రూ.20వేల నుంచి రూ.30వేలు వసూళ్లు

టీచర్ల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నా.. వైకల్యం పేరుతో కొందరు ఒకేచోట పాతుకుపోతున్నారు. తప్పుడు దోవలో సర్టిఫికెట్లు సమర్పిస్తున్నారు. దీంతో ప్రభుత్వం మార్పులు చేసింది. గతంలో 40 శాతం వైకల్యం ఉన్నవారు కూడా అడ్డగోలుగా సర్టిఫికెట్లు తీసుకుని బదిలీల్లో లబ్ధిపొందారు. ఈసారి ప్రభుత్వం కేటగిరీలుగా నిర్ణయించింది. 80 శాతం కంటే ఎక్కువ శారీరకం వైకల్యం, దృష్టి లోపం, వినికిడి లోపం ఉన్నవారికి.. క్యాన్సర్, గుండె ఆపరేషన్, అవయవ మార్పిడి, న్యూరో, టీబీ, కిడ్నీ, డయాలసిస్, స్పైనల్ సర్జరీ చేయించుకున్న వారు.. స్పౌజ్ కానీ, పిల్లలు కానీ బుద్ధిమాంద్యంతో బాధపడుతూ ఉన్నవారు, తలసేమియా.. ఇలా రకరకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి బదిలీల్లో ప్రాధాన్యత ఇస్తారు. వీరందరికీ మెడికల్ క్యాంపు ద్వారా వారి వ్యాధులు నిర్ధారించాల్సి ఉంటుంది. ఆ సర్టిఫికెట్లు సమర్పించిన వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు.

గతంలో కూడా వైకల్యం పేరిట అడ్డగోలుగా తప్పుడు సర్టిఫికెట్లు పొంది కొందరు బదిలీల్లో ప్రాధాన్యత పొందారనే ఆరోపణలు ఉన్నాయి. వీరు ఈసారి కూడా అదే మాదిరి సర్టిఫికెట్లు పొందేందుకు యత్నం చేస్తున్నారు. దీంతో రిమ్స్‌లో ఓ వైద్యాధికారి ఒక్కో సర్టిఫికెట్ కోసం రూ.20వేల నుంచి రూ.30వేలు వసూలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే కొందరి వద్ద వసూలు చేశారని చెబుతున్నారు. ఈ విషయం బయటకు పొక్కింది. ఆ అధికారి గతంలో పనిచేసిన చోట అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఆ అధికారే తాను మేనేజ్ చేస్తాను, మీకు కావాల్సిన మార్కులు వేయిస్తానంటూ దళారుల ద్వారా కలెక్షన్లు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై రిమ్స్ ఆర్ఎంవో శ్రీనివాసులును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం కేవలం రూ.1000 మాత్రమే చెల్లించాలన్నారు. టీచర్లను ఎవరైనా డబ్బులు అడిగితే నేరుగా తనకు ఫిర్యాదు చేయాలన్నారు.



ప్రజాధనం స్వాహా..!

● రూ.2.93 కోట్ల పంచాయతీ నిధులు పక్కదారి
● ఒక్క వేంపల్లెలోనే రూ.1.88 కోట్లు బొక్కేశారు
● వైసీపీ పాలనలో సర్పంచ్‌ల ఇష్టారాజ్యం
● వెలుగులోకి వస్తున్న నాటి అవినీతి



రూ.1.88 కోట్ల నిధులు పక్కదారి పట్టిన వేంపల్లె మేజర్ పంచాయతీ కార్యాలయం

కడప రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మంత్రుల స్థాయి నుంచి సర్పంచ్ వరకూ.. అవినీతిలో ఎవ్వరూ తగ్గేదేలా అనేలా వ్యవహరించారు. జగన్ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ నేతల అండతో అత్యధికమంది సర్పంచ్‌లు కొలువుదీరారు. వీరిలో చాలామంది అభివృద్ధి మాటున అవినీతికి తెరలేపారు. రూ.కోట్ల ప్రజాధనాన్ని అడ్డదారుల్లో కొల్లగొట్టారు. జిల్లాలో 557 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో కేవలం 13 పంచాయతీల్లోనే రూ.2.93 కోట్ల నిధులను స్వాహా చేశారు. మిగిలిన పంచాయతీల్లో ఇంకెన్ని రూ.కోట్లు తిన్నారో..? ఒక్క వేంపల్లె పంచాయతీలోనే రూ.1.88 కోట్లు బొక్కేశారు. ఒంటిమిట్ట మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఉండగా ఏకంగా 10 పంచాయతీల్లో రూ.91.67 లక్షలు ఆరగించారు. పెండ్లిమర్రి మండలం ఎల్లటూరు పంచాయతీలో రూ.10.57 లక్షలు, చాపాడు మండలం బద్రిపల్లెలో రూ.2.56 లక్షలు బొక్కేశారు. పంచాయతీలకు వచ్చే నిధుల్లో సింహభాగం అప్పట్లో జగన్ ప్రభుత్వం ఇతరవాటికి మళ్లించేసింది. మిగిలిన అరకొర నిధులను ఇలా సర్పంచ్‌లు కార్యదర్శులతో కుమ్మక్కై నొక్కేశారు. దీనిపై వైసీపీ హయాంలో ఫిర్యాదు చేయాలన్నా భయపడేవారు. టీడీపీ అధికారంలోకి రావడంతో పంచాయతీలలోని అవినీతిపై ఫిర్యాదుల పర్వం ప్రారంభమైంది. దీంతో అవినీతి సర్పంచ్‌ల బాగోతం వెలుగులోకి వస్తోంది.

వేంపల్లెలో ముగ్గురు కార్యదర్శులు..

మేజర్ గ్రామ పంచాయతీ అయిన వేంపల్లెలో ముగ్గురు కార్యదర్శులు పనిచేస్తున్నారు. 2023-24 వైసీపీ హయాంలో ఈ పంచాయతీలో ఏకంగా రూ.1.88 కోట్లను స్వాహా చేశారు. ఇందుకు సంబంధించి ముగ్గురు కార్యదర్శులకు అవినీతి ఉచ్చు బిగుసుకుంది. ఇప్పటికే స్వాహా అయిన సొమ్ములో రూ.51 లక్షలను వీరు తిరిగి జమచేసినట్లు సమాచారం.

ఎల్లటూరు సర్పంచ్ రాజీనామా

పెండ్లిమర్రి మండలం ఎల్లటూరు సర్పంచ్ పంచాయతీ నిధులను స్వాహా చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. కలెక్టర్ ఆదేశాలమేరకు పంచాయతీశాఖ విచారణకు ఆదేశించింది. ఎల్లటూరు గ్రామ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు, జనరల్ ఫండ్ నిధులు కలిపి రూ.10,57,827లు 2023-24లో మూడు విడతలుగా పక్కదారి పట్టించినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. పంచాయతీ సెక్రటరీ పర్యవేక్షణ లోపమే కారణంగా కమిటీ గుర్తించింది. ఇంతలో ఎల్లటూరు సర్పంచ్ తన పదవికి రాజీనామా చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీలలో విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.


పెండ్లిమర్రి మండలంలోని ఎల్లటూరు పంచాయతీ కార్యాలయం

ఒంటిమిట్ట మండలంలో..

ఒంటిమిట్ట మండలంలో మొత్తం 13 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో ఏకంగా 10 పంచాయతీలలో రూ.91,67,946 తినేశారు.

పంచాయతీ	స్వాహా చేసిన నిధులు
పెన్నపేరూరు	రూ.8,82,529
రాచగుడిపల్లె	రూ.19,34,633
గొల్లపల్లె	రూ.6,89,083
గంగపేరూరు	రూ.1,30,600
నర్వకాటుపల్లె	రూ.8,05,124
నడింపల్లి	రూ.11,75,977
కోనరాజుపల్లె	రూ.10,72,394
చింతరాజుపల్లె	రూ.10,56,529
సాలాబాద్	రూ.14,21,077
కొండమాసుపల్లె	రూ.3,11,664

నిధుల దుర్వినియోగం వాస్తవమే



పెండ్లిమర్రి మండలం వెల్లటూరు పంచాయతీలో రూ.10,57,827లు దుర్వినియోగం జరిగినట్లు విచారణలో తేలింది. అప్పటి గ్రామ పంచాయతీ సెక్రటరీ లక్ష్మీపతి నిర్లక్ష్యం వలనే నిధులు దుర్వినియోగం అయ్యాయని అతనిని ఎందుకు సస్పెండ్ చేయకూడదో సమాధానం ఇవ్వాలని, అలాగే గ్రామ సర్పంచ్ చెక్‌పవర్‌ను ఎందుకు రద్దు చేయకూడదో సమాధానం ఇవ్వాలని ఇద్దరికీ నోటీసులు జారీ చేశాం. వేంపల్లెలో రూ.1.88 కోట్లు దుర్వినియోగం వాస్తవమే. ఇప్పటికే అక్కడ రూ.51లక్షలు రికవరీ చేశాం. ఒంటిమిట్ట మండలం విషయం కూడా మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ జరుగుతోంది.

\- రాజ్యలక్ష్మి, పంచాయతీశాఖ జిల్లా అధికారి

సుండుపల్లెలో
ఘరానా మోసం

సుండుపల్లెలో దొంగ పాసుపుస్తకాల గుట్టు రట్టయింది. ఒక్కో పాసుపుస్తకానికి రైతుల వద్ద నుంచి వేలు, లక్షల్లో వసూళ్లకు పాల్పడినట్లు ఓ రైతు ఫిర్యాదుతో వెలుగు చూసింది. మండలానికి చెందిన ఓ వ్యక్తి గత కొన్నేళ్లుగా తహసీల్దార్ కార్యాలయంలో తిరుగుతూ గతంలో సుండుపల్లెలో అటెండర్‌గా పనిచేసిన తన భార్య ఉద్యోగాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నాడు. ప్రస్తుతం అతడి భార్య ఇక్కడ పనిచేయకపోయినా అక్రమ పాసుపుస్తకాలు, దొంగ పొజిషన్ సర్టిఫికెట్లు సృష్టించి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. రెండు రోజుల కిందట సాక్ష్యాలతో సహా వెలుగులోకి రావడంతో మండలంలో ఆ వ్యక్తిని నమ్మి మోసపోయిన బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

- అక్రమ పాసుపుస్తకాల పేరిట బురిడీ
- అధికార ముద్ర, సంతకాలు ఫోర్జరీ
- రైతుల నుంచి లక్షల్లో వసూళ్లు
- పోలీసులకు ఓ రైతు ఫిర్యాదు

సుండుపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి గ్రామ పంచాయతీ జేసీ కురవపల్లికి చెందిన అన్నారపు నారాయణ అనే రైతును పూజారి నాగన్న అనే వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొన్ని నెలల క్రితం.. 'నీకు స్థలం ఉంది కదా.. నువ్వు ఇలాగే ఉంటే ఎలా? నాతో మాట్లాడు.. మా సార్‌తో మాట్లాడి పట్టా చేయిస్తాన'ని చెప్పారని తెలిపారు. ఆ తర్వాత నెల రోజుల తర్వాత ఫోన్ చేసి పట్టా చేయిస్తానని రూ.50 వేలు తీసుకుని మోసం చేశారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాను తన భార్య కేరళలో కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నామని, రూ.50 వేలు సంపాదించాలంటే సుమారు మూడు నెలలు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. డబ్బులు తీసుకోవడంతో పాటు దొంగ పాసుపుస్తకం జారీ చేసి తమ కడుపు కొట్టారని వాపోయాడు. మోసపోయిన విషయం తెలుసుకుని పూజారి నాగన్నకు ఫోన్ చేస్తే బెదిరిస్తున్నాడని, సుండుపల్లె ఎస్‌ఐ, తహసీల్దార్‌లు తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ అక్రమ పాసుపుస్తకాల జారీ వెనుక ఒకరిద్దరు వీఆర్‌వోల హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.



బాధిత రైతు అన్నారపు నారాయణ



దొంగ పాసుపుస్తకం సిద్ధం చేసిన దృశ్యం



పాసుపుస్తకంలో ఫోర్జరీ సంతకాలు, ఫోర్జరీ అధికార ముద్ర

పెద్ద సంఖ్యలో అక్రమ పట్టాలు జారీ

మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలకు గిరాకీ ఉండడంతో ఇంటి పట్టాల నుంచి పాసుపుస్తకాల వరకు పెద్ద మొత్తంలో నగదు చేతులు మారి అక్రమ పట్టాలు వెలుగు చూసినట్లు సమాచారం. గత ఐదు సంవత్సరాల్లో వందల సంఖ్యలో జగనన్న కాలనీలకు, ఇతర విలువైన ప్రభుత్వ స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు తహసీల్దార్ కార్యాలయం నుంచి జారీ అయ్యాయి. ఇవన్నీ ప్రస్తుతం నిర్మాణాలు, అమ్మకాలు జరుగుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం రెవెన్యూ అధికారులే అని స్పష్టంగా తెలుస్తోంది. ఈ విషయంపై ఎస్‌ఐ శ్రీనివాసులును వివరణ కోరగా అక్రమ పాసుపుస్తకాలకు సంబంధించి ఓ వ్యక్తి డబ్బు తీసుకుని మోసం చేసినట్లు రైతు తమకు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు.

మాన్యువల్ పాస్ పుస్తకాల జారీ జరగలేదు

తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎటువంటి పాసుపుస్తకాలు జారీ కాలేదు. 2015 సంవత్సరం తరువాత మాన్యువల్ పాసుపుస్తకాల జారీని ప్రభుత్వం నిలిపివేసింది. ఆ పాసుపుస్తకాలు జారీ చేసిన వ్యక్తికి, తహసీల్దార్ కార్యాలయానికి సంబంధం లేదు.

\- దైవాదీనం, తహసీల్దార్, సుండుపల్లె

రంగసముద్రం చెరువులో
అక్రమంగా చేపలవేట

- వేలం నిర్వహించని అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అతి పెద్ద చెరువుల్లో ఒక్కటైన రంగసముద్రం చెరువులో గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా చేపలు పట్టుకునేందుకు జాలర్లను దింపారు. రంగసముద్రం చెరువులో చేపల వేట వేలం ద్వారా గత ఆర్థిక సంవత్సరానికి రూ.17 లక్షల వరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. అయితే ఆ గడువు ముగియడంతో మళ్లీ వేలం పాటలకు అధికారులు నిర్ణయించారు. అయితే చెరువు మాకే కావాలని అప్పటి వైసీపీ మద్దతుదారులైన పాత వేలం పాటదారులు అధికారులతో కుమ్మక్కై వారికే వేలం దక్కేలా చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఆయకట్టుదారులు, గ్రామస్థులు అధికారుల తీరును ఎండగట్టి వేలం పాటలను రద్దు చేయించారు. బహిరంగ ప్రకటన ఇచ్చి వేలం పాటలను నిర్వహించాలని కోరారు. మళ్లీ నెల రోజుల క్రితం రెండు రోజులు మాత్రమే గడువు ఇచ్చి వేలం పాటలు నిర్వహించడానికి పంచాయతీ అధికారులు సమాయత్తమయ్యారు. ఇందులో కూడా గోల్‌మాల్ జరుగుతోందని గ్రహించిన గ్రామస్థులు దానిని కూడా అడ్డుకున్నారు. ఈసారి పారదర్శకంగా వేలం పాటలు నిర్వహిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కానీ నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ వేలం పాటలు నిర్వహించలేదు. వేలం పాట నిర్వహిస్తే దాదాపు రూ.50 లక్షలకు పైగా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అయితే పాత వేలం పాటదారులు చెరువులో చేపలను పట్టడానికి జాలర్లను దింపడంతో గ్రామస్థులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే వేలం పాటలను నిర్వహించాలని కోరుతున్నారు. అక్రమంగా చేపలు పడుతున్న వారిని అడ్డుకుంటామని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్‌ను వివరణ కోరగా చెరువు వేలం వివాదం కోర్టులో ఉందని, బహిరంగ వేలం త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. వేలం పాట నిర్వహించే వరకు ఎవరూ చెరువులో చేపలు పట్టకూడదని, అలా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చేపల వేట కోసం చెరువు వద్ద ఏర్పాట్లు చేసుకున్న జాలర్లు

రిటైర్డు ఎస్‌ఈ పెన్షన్‌లో 10 శాతం కోత

కలికిరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కడప గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా పనిచేసి శ్రీకాకుళంలో పదవీ విరమణ చేసిన బి.ఎన్.శ్రీనివాసులు నెలవారీ పెన్షన్‌లో 10 శాతం శాశ్వత కోత విధిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన కడపలో పనిచేసే కాలంలో 2015లో తాగునీటి సరఫరా శాఖ కు అవసరమయ్యే పైపులు, ఇతర పరికరాలు సరఫరా చేయడానికి నిబంధనలకు విరుద్ధంగా అత్యధికంగా ధరలు పెంచి కొనుగోలుకు అనుమతించినట్లు ప్రధాన అభియోగం. ఇందులో ఎస్‌ఈ శ్రీనివాసులు అనేక అక్రమాలకు పాల్పడ్డట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు నిగ్గు తేల్చింది. విజిలెన్స్ నివేదికపైన ఇంజనీర్ ఇన్ చీఫ్ బి.రాజేశ్వర రావు విచారణ చేసి అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. అనంతరం శ్రీనివాసులు వైపు నుంచి అందిన సంజాయిషీలను పరిశీలించి మరో ఇంజనీర్ ఇన్ చీఫ్-3 కె.కిశోర్‌కుమార్‌కు విచారణను అప్పగించారు.

ఆ తరువాత మరో ఇద్దరు చీఫ్ ఇంజనీర్లు పి.సంజీవరెడ్డి, టి.గాయత్రీదేవిలను విచారణాధికారులుగా నియమించారు. అన్ని విచారణల్లోనూ అక్రమాలు రుజువైనట్లు తేలడంతో చివరగా ఎస్‌ఈ శ్రీనివాసులు వాదనలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. అయితే శ్రీనివాసులు సంజాయిషీలు సంతృప్తికరంగా లేకపోవడంతో చివరకు ఆయన పెన్షన్‌లో శాశ్వతంగా 10 శాతం కోత విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

స్థానిక జాతి చెట్లను అభివృద్ధి చేయాలి : డీఎఫ్‌వో

కడప ఎన్జీఆర్ సర్కిల్/సిద్దవటం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతి చెట్లను అటవీ ప్రాంతాల్లో ఇతర ప్రదేశాల్లో అభివృద్ధి చేయడం అత్యంత అవసరమని జిల్లా అటవీ అధికారి వినీత్ తెలిపారు. కడప స్థానిక అటవీ పునరుద్ధరణ ప్రాజెక్టు ప్రారంభం కార్యక్రమాన్ని వైఎస్సార్ అటవీ విభాగం ఆధ్వర్యంలో రాజీవ్ స్మృతివనంలో గురువారం నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని డీఎఫ్‌వో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవి జంతువుల రక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు. అటవీ సంరక్షణలో భాగంగా నర్సరీలో ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన మొక్కలు ఉత్పత్తి చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. వర్మీకంపోస్టు తయారీ విధానం కూడా ప్రజలకు వివరించారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు అటవీ శాఖ సిబ్బంది తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

కార్యక్రమంలో కడప ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్, కడప డ్వామా ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఉపాధి హామీ ఏపీవోలు, సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి, అటవీశాఖ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్

తీర్థయాత్రకు వెళ్లి ఆర్టీసీ డ్రైవర్ మృతి

పీలేరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కుటుంబసభ్యులతో సహా తీర్థయాత్రలకు వెళ్లిన ఆర్టీసీ డ్రైవర్ మరణించిన సంఘటన గురువారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు పట్టణం బండ్లవంకకు చెందిన దేవతి భాస్కరశెట్టి (52) తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ముషీరాబాద్ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతను తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 21న కోటప్పకొండ, మంగళగిరి, అమరావతి, అన్నవరం వంటి పుణ్యక్షేత్రాలకు తీర్థయాత్రకు వెళ్లాడు. బుధవారం మధ్యాహ్నం అన్నవరం ఆలయ దర్శనానంతరం లాడ్జీలోని రూము ఖాళీ చేసి వస్తుండగా కాలు జారి మెట్ల మీద నుంచి జారిపడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని తునిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.



భాస్కరశెట్టి (ఫైల్)

హత్య కేసులో నిందితుడు అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

నందలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రచెరువుపల్లెలో గత యేడాది జరిగిన హత్యకేసులో నిందితుడిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే తెలిపారు. ఆయన కథనం మేరకు... సత్తుపల్లె వెంకటరెడ్డి అదే గ్రామానికి చెందిన నాగప్రతాప్‌రెడ్డిల మధ్య కోడిపుంజు విషయమై 2024లో జూలై 27న గొడవ జరిగింది. వెంకటరెడ్డి నాగప్రతాప్‌రెడ్డిని అసభ్యకరంగా తిట్టగా నాగప్రతాప్‌రెడ్డిని అతడి ఇంటిలోనికి తీసుకెళ్లి మచ్చుకత్తితో తలమీద నరికాడు. మరుసటిరోజు వెంకటరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగప్రతాప్ రెడ్డి అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. గురువారం నిందితుడిని అరెస్టు చేశారు. నందలూరు పోలీసుస్టేషన్‌లో క్రైం నంబరు 99/2024యు/ఎస్103(1) హత్య కేసులోని నిందితుడి గురించి వచ్చిన సమాచారం మేరకు రాజంపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బీవీ రమణ నందలూరు సిబ్బందితో నాగిరెడ్డిపల్లె గ్రామంలోని పాత ఆర్‌అండ్‌బీ బంగ్లా దగ్గర నిందితుడు నాగప్రతాప్‌రెడ్డిని అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన మచ్చుకత్తిని స్వాధీనపరుచుకుని రిమాండ్‌కు పంపించామన్నారు. కాగా రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, నందలూరు పోలీసుస్టేషన్ సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

అక్రమాస్తుల కేసు నుంచి ఏఎస్‌వోకు విముక్తి

కలికిరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె మండల తహసీల్దార్ కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసరు (ఏఎస్ఓ)గా పనిచేసి పదవీ విరమణ చేసిన చింతపల్లి గోవిందరాజులుకు అక్రమాస్తుల కేసు నుంచి పదేళ్ల తరువాత విముక్తి కలిగిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. 2015లో గోవిందరాజులు అక్రమాస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఏసీబీ డైరెక్టర్ జనరల్ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం గోవిందరాజులుపై ప్రాసిక్యూషన్ చర్యలకు ప్రభుత్వం 2017 ఏప్రిల్ 24 ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ప్రాసిక్యూషన్ ఆదేశాలపై గోవిందరాజులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు ప్రభుత్వ ప్రాసిక్యూషన్ ఆదేశాలను కొట్టేస్తూ గోవిందరాజులుకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే దీనిపై ప్రభుత్వం హైకోర్టులోనే అప్పీల్ పిటీషన్ దాఖలు చేసింది.

ఈలోగా హైకోర్టు తీర్పు మేరకు అక్రమాస్తుల కేసు నుంచి తనకు విముక్తి కలిగించాలని ప్రభుత్వానికి విన్నవించారు. అయితే తీర్పు వెలువడిన తరువాత అప్పీలు పిటీషన్ దాఖలు చేసే వ్యవధికి సంబంధించి సాంకేతికపరమైన సమస్య రావడంతో చివరకు తన అప్పీలు పిటీషన్ ఉపసంహరించుకోవాలని ఏసీబీ డైరెక్టర్ జనరల్‌కు సూచిస్తూ ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో గోవిందరాజులుపై నమోదైన అక్రమాస్తుల కేసులో ఆయనకు ప్రాసిక్యూషన్ నుంచి విముక్తి లభించినట్లయ్యింది.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

రాయచోటిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా గురువారం రాయచోటి, మదనపల్లె, రాజంపేట సబ్ డివిజన్ల పరిధిలో పోలీసు అధికారులు వారి సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రాయచోటిలో అర్బన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 10 మోటారు సైకిల్స్ 12 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై 27 కేసులు నమోదు చేశారు. 9 చోట్ల నాకాబందీ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలపై ఈ చలానాలు నమోదు చేసి ఒక లక్షా 9 వేల 9 వందల 75 రూపాయలు జరిమానా విధించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై అనుమానం ఉన్న వ్యక్తులపై ఆరా తీశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. రాత్రి సమయాల్లో చిన్నచిన్న సంఘటనలు పెద్ద సంఘటనలుగా ప్రజల్లో వ్యాప్తి చెందుతుందన్నారు.



రాయచోటిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వీఆర్‌వోపై దాడి ఘటనలో డీఎస్పీ విచారణ



తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేస్తున్న డీఎస్పీ

గాలివీడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పందికుంట వీఆర్‌వో జయన్నపై జరిగిన దాడి ఘటనలో రాయచోటి డీఎస్పీ ఎస్.మహేంద్ర విచారణ చేపట్టారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన తహసీల్దార్ భాగ్యలత, సిబ్బందితో సమావేశమై దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత వీఆర్‌వోతో కలిసి దాడి జరిగిన ప్రదేశంలో దాడి ఎలా జరిగిందన్న విషయంపై క్షుణ్ణంగా పరిశీలించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసుకున్నారు. ఈ దాడి ఘటనలో సాక్షులుగా ఉన్న సిబ్బందిని వేర్వేరుగా ఒక్కొక్కరిని విచారించి సమాచారం తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఈ కేసులో నిందితులుగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ హేమసుందర్‌రెడ్డి ఆయన తండ్రి రామచంద్రారెడ్డిపై ఇది వరకే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో ఎస్‌ఐ రామక్రిష్ణ, ఆర్‌ఐ బాలాజీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'బాహుబలి' యంత్రాలు

- 95 టన్నుల గడ్డర్లను అవలీలగా ఎత్తేసిన క్రేన్లు
- ఫ్లైఓవర్ నిర్మాణాల్లో కీలకంగా మారిన క్రేన్లు



పిల్లర్లపై గడ్డర్‌ను ఎత్తి పెడుతున్న క్రేన్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఐదు టన్నుల బరువుండే లాకర్లను ఏదైనా ఎత్తయిన భవనాల పైకి ఎత్తాలంటేనే క్రేన్ల సహాయంతో ఆపసోపాలు పడాల్సి ఉంటుంది. అలాంటిది 95 టన్నుల గడ్డర్లను 20 అడుగుల ఎత్తయిన పిల్లర్ల మీదికి చేర్చాలంటే ఇంకెంత పెద్ద క్రేన్లు అవసరమో తెలుస్తుంది. మదనపల్లె మండలం ఆరోగ్యవరం దిగువన నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వద్ద అలాంటి బాహుబలి క్రేన్లు రెండు చూపరులను ఆశ్చర్యానికి గురి చేశాయి. మదనపల్లె-పీలేరు మధ్య నాలుగు లేన్ల జాతీయ రహదారి (ఎన్‌హెచ్-71) పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఎన్‌హెచ్-71 కింద తిరుపతి-మదనపల్లె ట్రంకు రోడ్డు క్రాసింగ్ అవుతోంది. ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి నాలుగు పిల్లర్లను కూడా సిద్ధం చేశారు. సుమారు నాలుగు నెలలుగా ఈ పిల్లర్ల సమీపంలోనే ఎనిమిది గడ్డర్లను కాంట్రాక్టు సంస్థ ఆర్‌సీసీ ద్వారా తయారు చేసింది. ఒక్కో గడ్డర్ సుమారు 95 టన్నుల దాకా బరువు ఉంటుంది. ఇలాంటి గడ్డర్లను ఎనిమిందిటిని పిల్లర్ల పైకి ఎత్తేంతుకు ప్రత్యేక క్రేన్లను తెప్పించారు.

బాహుబలి క్రేన్లు

ఎన్‌హెచ్-71 నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టు సంస్థ ప్రత్యేకంగా రూ.8 కోట్లు పెట్టి అత్యాధునికంగా పనిచేసే రెండు బాహుబలి క్రేన్లను కొనుగోలు చేశారు. ఈ క్రేన్లు అంతా ఎలక్ట్రానిక్ పద్ధతులతో, సెన్సార్లతో అతి బలమైన ఉక్కు తీగలు, క్రేన్లతో తయారు చేశారు. ఒక్కో క్రేన్ గరిష్ఠంగా ఎత్తే బరువు 48 టన్నులు కాగా, రెండు క్రేన్ల సహాయంతో ఒక్కో గడ్డర్‌ను ఎత్తి పిల్లర్లపై పెడుతున్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ప్రక్రియలో ఎలాంటి చిన్న పొరపాటు, తప్పు జరిగినా కోట్ల విలువైన యంత్రాలు పాడవటంతో పాటు, విలువైన కార్మికుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో నిష్ణాతులైన ఇంజనీర్ల పర్యవేక్షణలో గడ్డర్లను భారీ ట్రాలీ లారీల్లో ఎక్కించి పక్కనే వున్న పిల్లర్ల వద్దకు ఇంచి, ఇంచి జరుపుకుంటూ వచ్చారు. ఒక గడ్డర్‌ను రెండు చివర్లా రెండు క్రేన్లు సమానంగా ఉక్కుతీగలతో కట్టి అర అడుగు చొప్పున, రెండు వైపులా ఒకే ఎత్తులో ఉండేలా పైకి ఎత్తారు. ఇలా 20 అడుగుల ఎత్తయిన పిల్లర్ల మీదకు ఒక్కో గడ్డర్‌ను ఎక్కించేందుకు రెండు గంటల సమయం పట్టింది. ఇలా ఎనిమిది గడ్డర్లను ఎత్తేందుకు ఇంజనీర్లు రెండు రోజుల సమయం తీసుకున్నారు.

ఫ్లైఓవర్ల నిర్మాణంలో కీలకం

మదనపల్లె నుంచి పీలేరు వరకు నిర్మిస్తున్న ఎన్‌హెచ్-71 నాలుగు లేన్ల రహదారి మార్గంలో పలుచోట్ల రోడ్ల క్రాసింగ్‌లు, చెరువు, నదులు ఉండటంతో ఈ ప్రాంతాల్లో ఫ్లైఓవర్లను డిజైన్ చేసి నిర్మించారు. 52 కిలోమీటర్ల పొడవునా జాతీయ రహదారిపై సుమారు 30 చోట్ల ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నారు. సిమెంటు గడ్డర్లతో పిల్లర్లపైన నిర్మించే బ్రిడ్జిలు (ఫ్లైఓవర్లు) ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో ఒక్కో గడ్డర్ ఎంత లేదన్నా 95 టన్నుల బరువు ఉంటుంది. వీటిని ఎత్తి పిల్లర్లపైకి పెట్టేందుకు నిర్మాణ సంస్థ రూ.8 కోట్లతో రెండు బాహుబలి క్రేన్లను తెప్పించడంతో ఇవే కీలకపాత్ర పోషిస్తున్నాయి. దీంతో నిర్మాణంలో ఫ్లైఓవర్లను చాకచక్యంగా, అవలీలగా పూర్తి చేస్తున్నారు.



పిల్లర్లపైకి వరుసగా ఎత్తి పెట్టిన అతి బరువైన గడ్డర్లు



గడ్డర్లను ఫ్లైఓవర్ సమీపంలోకి తీసుకొస్తున్న ప్రత్యేక ట్రాలీ లారీ

మే నెలలో టీచర్ల బదిలీలు

● పారదర్శక నిర్వహణకు ప్రభుత్వం చర్యలు

● దివ్యాంగులు, వ్యాధి పీడితులకు సర్టిఫికెట్లు ● 26 వరకు మెడికల్ క్యాంప్ ఏర్పాటు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు మే నెలలో నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పారదర్శకంగా బదిలీలు నిర్వహించేందుకు టీచర్ల బదిలీల నియత్రణ చట్టం-25 అమలులోకి తెచ్చిన రాష్ట్ర ప్రభు త్వం ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ విధానంలో జరగనుంది. టీచర్ల బదిలీల్లో అర్హులైన దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిపీడితులు, వారిపై ఆధారపడిన పిల్లలకు ముందుగానే అవసరమైన మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేయించేందుకు చర్యలు చేపట్టింది. అక్రమాలకు తావు లేకుం డా కేవలం అర్హులైన వారికి మాత్రమే మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈనెల 24 నుంచి 26 వరకు జిల్లా స్థాయిలో మెడికల్ బోర్డులు ఏర్పాటు చేసి బదిలీ కోసం దర ఖాస్తు చేసుకునే వారికి సర్టిఫికెట్లు జారీచేయాలని పాఠశాల విద్య కమి షనర్ విజయరామరాజు, వైద్యశాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. కడప జిల్లాలోని టీచర్లందరు ప్రభు త్వ సర్వజన ఆసు పత్రి మెడికల్ క్యాంప్ నుంచి సర్టిఫికెట్లు పొందాల్సి ఉంటుంది.

బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీల్లో మార్పులు

బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీల్లో మార్పులు చేశారు. గతంలో కేవలం 40శాతం వైకల్యం ఉన్న వారిని కూడా ప్రాధాన్యత కేటగిరీల్లో చేర్చడంతో కుప్పలు తెప్పలుగా సర్టిఫికెట్లు తెచ్చి బదిలీల్లో లబ్ధిపొందారు. ప్రస్తుతం తీవ్ర వైకల్యం ఉన్న వారినే ప్రాధాన్యత కేటగిరీగా పరిగణించనున్నారు. 40శాతం నుంచి 55శాతం శారీరక వైకల్యం, దృష్టిలోపం, వినికిడిలోపం ఉన్న వారికి కూడా బదిలీల్లో ప్రత్యేక పాయింట్లను కేటాయిస్తారు.70 నుంచి 80శాతం వైకల్యం ఉంటేనే ప్రాధాన్యత కేటగిరీ టీచ ర్ల బదిలీల్లో ప్రత్యేక వెసులుబాటు ఉంది. వీరికి వచ్చిన పాయింట్లతో సంబంధం లేకుండా బదిలీల్లో స్థానాలు కోరుకు నేందుకు ముందుగా అవకాశం ఇస్తారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు ప్రాధాన్యత కేటగిరీలో స్థానం పొందేం దుకు గతంలో కొందరు అడ్డదారుల్లో సర్టిఫికెట్లు తెచ్చుకొని లబ్ధిపొందారు. ప్రస్తుతం ఆ అక్రమాలకు చెక్ పెట్టి అర్హులైన దివ్యాంగులకు మేలు జరిగేలా తీవ్ర వైకల్యం ఉన్న వారిని మాత్రమే ప్రాధాన్యత కేటగిరీలో స్థానం కల్పిస్తున్నారు.

● 80 శాతం, 70శాతం అంతకంటే ఎక్కువ శారీరక వైకల్యం, దృష్టిలోపం ఉన్నవారు.

● క్యాన్సర్, గుండె ఆపరేషన్, అవయవమార్పిడి, మేజర్ న్యూరో సర్జరీ, బోన్, టీబీ, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, స్పైనల్ సర్జరీ చేయించుకున్నవారు.

● స్పౌజ్ కాని, పిల్లలు కాని బుద్ధిమాంద్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నవారు. తలసేమియా, హీమోఫిలియా, మస్క్యులర్ డిస్క్రోపుతో వైద్యం చేయించుకున్న పిల్లలు ఉన్న వారు. గుండెలో రంధ్రాలతో పుట్టిన పిల్లలు, ఆపరేషన్ చేయించుకున్న పిల్లలు ఉన్న టీచర్లను బది లీల్లో ప్రాధాన్యత కేటగిరీగా గుర్తిస్తారు. ఈ కేటగి రీలో బదిలీ కోరుకునే టీచర్లు ఇందుకు సంబం ధించిన సర్టిఫికెట్లు, గత మూడేళ్లకు సంబంధించి వైద్యం చేయించుకుంటున్న ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది. వీరందరు ఈనెల 24 నుంచి 26 వరకు ఈ మూడు రోజుల్లోనే సర్టిఫికెట్లు పొందాలి. ఆర్‌జేడీలు, డీఈఓలు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ఈ మూడు రోజుల్లో సర్టిఫికెట్ల జారీకి మెడికల్ క్యాంప్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.



సర్టిఫికెట్ ఆధారంగానే వర్తింపు : డీఈఓ షంషుద్దీన్

ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు, పూర్వపు ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలలో పనిచేస్తున్న ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులందరు ఆంధ్రప్రదేశ్ స్టేట్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్ట్-2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరీ స్పెషల్‌పాయింట్స్ పొందాల్సిన వారు తప్పని సరిగా మెడికల్ క్యాంప్ నకు హాజరు కావాలి. ఈ మేరకు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జిల్లా ప్రభుత్వ సర్వజనుల ఆసుపత్రిలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఉంటుంది. ఉపాధ్యాయులు తమ పాత ఆరోగ్య సర్టిఫికెట్లను చూపించి సంబంధిత వైద్యులచే పరిశీలన చేయంచుకొని నూతన మెడికల్ సర్టిఫికెట్ తప్ప నిసరిగా పొందాలి. ఈ క్యాంప్ పొందిన సర్టిఫికెట్ ఆధారంగా మాత్రమే ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్స్ వర్తింపజేస్తారు.

పాపాఘ్నికి కృష్ణాజలాలు తీసుకొస్తాం

● పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



వేంపల్లెలో ఎన్టీఆర్ సుజల వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బీటెక్ రవి

వేంపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నది వరకు పీబీసీ కాల్వ ద్వారా కృష్ణాజలాలను మరో పది పదైదు రోజుల్లోగా తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. వేంపల్లె ప్రాంతంలో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని.. కృష్ణా జలాలు తీసుకొచ్చి సమస్య లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. వేంపల్లె పట్ట ణం పులివెందుల రోడ్డు టీడీపీ కార్యాలయం సమీపంలో నూతనంగా ఏర్పా టు చేసిన ఎన్టీఆర్ సుజల వాటర్ ప్లాంట్‌ను మండల పరిశీలకుడు రఘునాథరెడ్డితో కలిసి బీటెక్ రవి గురువారం ప్రారంభించారు. అనంత రం చింతలమడుగుపల్లె సమీపంలో నీరులేక ఎండిపోతున్న తమలపాకు తోటలను పరిశీలించారు. లక్షలాది రూపాయలు వెచ్చించి సాగుచేశాం, నీళ్ల లేక తోటలు ఎండిపోతున్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా బీటెక్ రవి విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని చెరువులను యుద్ధ ప్రాతిపదికన నింపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్లే ప్రస్తుతం నియోజకవర్గంలో పనులన్నీ పెండింగ్‌లో పడ్డాయన్నారు. వందల కోట్లు ఖర్చుపెట్టినా పూర్తి స్థాయిలో తాగునీటి సమస్య పరిష్కరించలేని దుస్థితి ఉందన్నారు. మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, నామా వేమకుమార్, మండల ఉపాధ్యక్షుడు భద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులు రీసర్వేపై ఉన్న అనుమానాలు నివృత్తి చేసుకోవాలి : ఆర్డీవో



శివాలపల్లెలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

చెన్నూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రీసర్వే సమయంలో రైతులు తమ భూములకు సంబంధించిన ఎలాంటి అను మానాలున్నా అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ అన్నారు. మండలంలోని శివాలపల్లె గ్రామ సచివాలయంలో రీసర్వేపై ఏర్పాటు చేసిన సమా వేశంలో రైతులతో మాట్లాడారు. ప్రతి రైతు రీసర్వే పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి చిన్న సమస్యలున్నా తక్షణం రెవెన్యూ సిబ్బంది దృష్టికి తేవాలన్నారు. రైతుల మధ్య భూముల విస్తీర్ణంలో సెంటు, రెండు సెంట్లు లాంటి చిన్నపాటి తేడాలుంటే సర్దుబాటు చేసుకోవాలన్నారు. అలాగే భూములకు సంబంధించి ఇప్పటి వరకు 20 సమస్యలు వచ్చాయని, వాటిని తహసీల్దారు కార్యాలయంలో పరిష్కారం చేసుకొని ఖచ్చితమైన రికార్డులు పొందాలని సూచించారు. తహసీల్దారు సరస్వతి, ఆర్ఐ కౌశిక్, వీఆర్వో వెంకట సుబ్బయ్య, సచివాలయ సర్వేయర్లు వెంకటశివారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికం రూపుమాపాలని ప్రతి ఇంటా మహిళలు ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పని చేస్తున్నారని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎన్నారైల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం వైఎస్సార్ కడప జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏదో ఒకరంగంలో నూతన పారిశ్రామిక వేత్తలుగా రాణించాల్సి ఉందన్నారు. జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలో జరుగుతున్న మహిళాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను లక్ష్యం మేరకు పూర్తిచేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తున్నానని ఇందులో భాగంగా కడపకు వచ్చానన్నారు. ఈ జిల్లాలో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు అవకాశాలు ఏమి ఉన్నాయి? ఎంఎస్ ఎంఈ పరిశ్రమలను ఎలా ప్రమోట్ చేయాలి? మహిళా సంఘాలు పారిశ్రామికంగా రాణించేందుకు ఉన్న అవకాశా లు, కొందరిలో ఉన్న అపోహల నివృత్తి తదితర అంశాలపై కలెక్టర్, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో కలసి సమీక్షించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 ఇండస్ట్రియల్ పార్కులను ప్రారంభించ నున్నామని అందులో భాగంగా కడపలో రెండు పార్కులు ఉన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలు స్థాపించిన వారందరికి రూ.1600కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. అందులో ముఖ్యమంత్రి సబ్సిడీ కింద రూ.150కోట్లు విడుదల చేశారన్నారు. మీడియా సమావేశంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆగిన పనులు పూర్తిచేయండి : ఎంపీ



రంగనాథస్వామి ఆలయం వద్ద కోనేరుకు పూజలు చేస్తున్న ఎంపీ

పులివెందుల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఆగిపోయిన అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పులివెందుల రింగురోడ్డులో ఉన్న రంగనాథస్వామి ఆలయంలో నూతనంగా రూ.68లక్షలతో ఏర్పాటు చేసిన కోనేరును ఆయన పూజలు చేసి ప్రారంభంచారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందులలో వైసీపీ ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. అందులో కొన్ని పూర్తికాలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం వైసీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడంలో విఫలమవుతోందన్నారు. బనానా ప్రాసెసింగ్ యూనిట్, గరండాల్ రివర్‌ఫ్రంట్, ఉలిమెల్ల లేక్, హాకీ స్టేడియం తదితర వాటిని వినియోగంలోకి తేవాలన్నారు. ప్రశాంతంగా ఉన్న జమ్మూ కాశ్మీర్‌ను తీవ్రవాదులు చొరవడి కాల్పులు జరపడం దురదృష్టకరన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇందుకు అందరి మద్దతు ప్రభుత్వానికి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, అంకాళమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్ర, మారెట్ యార్డు మాజీచైర్మన్ చిన్నప్ప, పట్టణ ఉపాధ్యక్షులు పార్నపల్లె కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి పురస్కార గ్రహీత 'మూల'కు సత్కారం



మూలమల్లికార్జునరెడ్డిని సత్కరిస్తున్న లక్షుమయ్య

కడప కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కడప సిద్దార్థ ఇంగ్లీషు మీడియం స్కూలులో గురువారం కందుకూరి పురస్కార గ్రహీత ఆచార్య మూల మల్లికార్జునరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ స్కూలు కరస్పాండెంట్ లక్షుమయ్య మాట్లాడుతూ సాహిత్య నాటకరంగంలో బహుముఖ ప్రతి భను కనబరుస్తున్న మల్లికార్జునరెడ్డికి ప్రొద్దుటూరు చదువుల సాహిత్య కళా వేదిక వారు నటభూషణ బిరుదు, ఏపీ రాష్ట్ర చలనచిత్ర టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ తెలుగు నాటక రంగ దినోత్సవ సందర్భంగా కందుకూరి పుర స్కారాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. మల్లికార్జునరెడ్డి గత 20 సంవత్సరాలుగా తనకు పరిచయమని.. ఏ పని అయినా నిబద్ధతతో చేస్తారన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులందరికీ పీఎంఏవీవై లబ్ధి చేకూరాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన గర్భిణులందరికి ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం (పీఎంఏవీవై) ద్వారా లబ్ధి చేకూర్చేలా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా పీడీ జయంతితో కలిసి ముఖ్య అతిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భందాల్చిన తొమ్మిది నెలల్లోపు ఈ పథకానికి రిజిస్టర్ చేసుకోవా లన్నారు. ఇందుకు మొదట ప్రసవానికి మొదటి విడతలో రూ.3000, రెండవ విడతలో రూ.2000 లబ్ధిదారు ఖాతాలో జమ చేస్తారన్నారు. ఇందుకోసం అంగన్వాడీ టీచర్ గర్భిణీ హెల్త్ కార్డు, ఆర్‌సీఎస్ ఐడీ, ఆధార్ వివరాలు అడ్రస్ మొద లైనవి తీసుకొని వారి పోర్టల్‌లో రిజిస్టర్ చేయాలన్నారు. అక్కడ నుంచి సూపర్‌వైజర్ లాగిన్‌కు వెళ్తుంది. ఫీల్డ్ వెరిఫి కేషన్ చేసి తన లాగిన్‌లో అప్రూవ్ చేస్తారన్నారు. అక్కడ నుంచి సీడీపీఓ లాగిన్‌కు వెళ్తుందని వివరించారు. పీడీ డీటైల్స్ వెరిఫై చేసి జిల్లా లాగి న్‌కు సబ్మిట్ చేస్తారన్నారు. అక్కడ నుంచి స్టేట్ వెళ్లి అమౌంట్ పడుతుందని వివరించారు. అదేవిధంగా రెండవ కాన్పులో కూడా కేవలం ఆడపిల్ల పుడితే మాత్రం ఇదే పథకం అమలు అవుతుంది. మగపిల్ల వాడు పుడితే వర్తించదన్నారు. మొదటి కాన్పులో ఎవరు పుట్టినా ఈ పథకం వర్తిస్తుంద న్నారు. రెండవ కాన్పులో ఈ పథకం కింద రూ.6000 వేలు ఇస్తార న్నారు. కార్యక్రమంలో జజెండర్ స్పెషలిస్ట్, మిషన్ శక్తి స్కీం, హెల్త్ డిపార్ట్‌మెంట్ల రీసోర్స్ పర్సన్లు, రెండు జిల్లాల సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ ప్రాజెక్టులలోని సీనియర్ అసిస్టెంట్‌లు, బీపీసీలు పాల్గొన్నారు.

మంత్రి శ్రీనివాస్‌ను సత్కరించిన టీడీపీ నేత హరిప్రసాద్



కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎంఎస్ ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి బి.హరిప్రసాద్ శాలువ కప్పి సత్కరించారు. గురువారం కడప ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం టీడీపీ నేతలతో కలిసి పరిశ్రమల ఆవశ్యకతపై మంత్రితో చర్చించారు.

బొలెరో ఢీకొని వ్యక్తి మృతి

కడపక్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురం వద్ద బైకుపై వెళ్తున్న వ్యక్తిని బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై మృతి చెందినట్లు కడప ట్రాఫిక్ సీఐ జావేద్ తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన ఎం.బాబ్జీ (37)పని నిమిత్తం కడపకు వచ్చి తిరిగి బైకులో వెళుతున్నాడు. అదే సమయంలో తుఫాన్ వాహనాన్ని బొలెరో వాహనానికి కట్టుకుని వస్తుండగా రామాంజనేయపురం వద్దకు రాగానే బొలెరో బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో బాబ్జీ మృతి చెందగా మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని ఒకరు..

దువ్వూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడమడక సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామకృష్ణ (48) అనే వ్యక్తి వ్యక్తి మృతి చెందాడు. ఇడమడకకు చెందిన రామకృష్ణ నాలుగు రోడ్ల రహదారి మీద వెళుతుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రొద్దుటూరుకు పంపి కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

స్విమ్మింగ్ పూల్‌లో పడి బాలుడి మృతి

● గోప్యంగా ఉంచుతున్న నిర్వాహకులు



బాలుడి మృతదేహం

కడపక్రైం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న ఓ స్విమ్మింగ్ పూల్‌లో గురువారం సాయంత్రం ఈతకు వెళ్లిన బాలుడు మృతి చెందాడు. కడప గంజికుంట కాలనీకి చెందిన బాలుడు ఈత కోసం మాచుపల్లె రోడ్డులోని స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లాడు. అయితే అక్కడ పిల్లలకు ఒకటి, పెద్దలకు ఒకటి వేర్వేరు ఈత కొలనులు ఉన్నాయి. అయితే లోతు ఎక్కువ ఉండటం, బాలుడికి ఈత రాకపోవడంతో నిమిషాల్లోనే ప్రాణాలు కోల్పోయాడు. గమనించిన అక్కడి వారు కేకలు వేయడంతో నిర్వాహకులు వచ్చి స్విమ్మింగ్ పూల్ నుంచి బాలుడి మృతదేహాన్ని వెలికితీశారు. ప్రథమ చికిత్స అందించినప్పటికీ బాలుడికి చలనం లేకపోవడంతో నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ఆ స్విమ్మింగ్ పూల్ నిర్వాహకుడు టీడీపీ నేత కావడం... ఇటీవల ఆ స్విమ్మింగ్ పూల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించడం జరిగింది. అయితే ఈ విషయాన్ని నిర్వాహకులు గోప్యంగా ఉంచారు. చిన్నచౌకు పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పడం గమనార్హం.

'టీటీడీ కల్యాణ మండపాన్ని తెరిపించండి'

వేంపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో మరమ్మతులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపాన్ని తెరిపించాలని తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డితో కలిసి టీటీడీ సభ్యుడికి వినతిపత్రం అందించారు. కల్యాణ మండపం తెరిపిస్తే పేద, మధ్యతరగతి వారు పెళ్లిళ్లు చేసుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గండి క్షేత్రాన్ని గతంలో టీటీడీలో విలీనం చేసుకున్నప్పుడు స్వాధీనం చేసుకున్న బంగారం, వెండిని తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

నాటుసారా, మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు



నగరిగుట్ట వీధుల్లో సిబ్బందితో పర్యటిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్

పులివెందుల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని మత్తు పదార్థాల విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం తెలవారుజామున నవోదయం 2.0 కార్యక్రమాన్ని నగరిగుట్టలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీ నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరిగుట్ట బి కేటగిరీ కింద ఉందన్నారు. రెండు నెలల్లో ఈ ప్రాంతాన్ని గ్రీన్ విలేజ్ - ఐడి ఫ్రీగా ప్రకటించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్రమ మద్యం విక్రయించే పాత నిందితులు మళ్లీ అక్రమ మద్యం కార్యకలాపాల్లో పాల్గొనవద్దని కఠినంగా హెచ్చరించామన్నారు. ప్రజల సహకారంతోనే నాటుసారా తయారీ, అమ్మకం, రవాణా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇప్పటికే ప్రత్యామ్నాయ జీవనోపాధి కింద కొందరిని గుర్తించి ప్రభుత్వం తరఫున రుణాలు ఇప్పించేందుకు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి, పులివెందుల రూరల్ సీఐ రమణ, ముద్దనూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విన్నీలత, ఈఎస్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి, ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంటేశ్వర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేటి శాంతి ర్యాలీని విజయవంతం చేయాలి

● వీహెచ్‌పీ, బీజేపీ, ప్రజా సంఘాల నాయకులు

కడప కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కశ్మీరులోని పహల్గాం పర్యాటకులపై ఉగ్ర దాడికి నిరసనగా నేడు చేపడుతున్న శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు చెన్నక్రిష్ణరెడ్డి, బెస్తవేముల రామ్‌మహేశ్, బీజేపీ జిల్లా నాయకుడు డాక్టర్ శివనాయక్ అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ ఈనెల 25న శుక్రవారం సాయంత్రం 5గంటలకు నగరంలోని కోటిరెడ్డిసర్కిల్ నుండి ఏడురోడ్ల కూడలి వరకు కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ చేపడుతున్నామని, పార్టీలకతీతంగా నాయకులు, స్వచ్ఛందంగా ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ ప్రతినిధులు స్వామి తురియానంద, బ్రాహ్మణ సంఘం ప్రతినిధి, వారణాసి శ్రీధర్‌శర్మ, సేవాసమితి నాయకుడు కొండారెడ్డి పాల్గొన్నారు.

ఉగ్రవాదుల కాల్పుల వెనుక పాకిస్తాన్ కుట్ర

● పీసీసీ డెలిగేట్ వేలూరు శ్రీనివాస్‌రెడ్డి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భారత పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిగిన ఘటనలో పాకిస్తాన్ హస్తం ఉందని కాంగ్రెస్ పీసీసీ డెలిగేట్ వేలూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఐదురోజుల క్రితమే పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ మునీర్ పాకిస్తాన్ ఓవర్సీస్ సమ్మిట్‌లో ఇచ్చిన స్టేట్‌మెంట్ చూస్తే భారతదేశాన్ని ఏ విధంగా అస్థిరపరచాలన్న కుట్ర కనబడుతుందన్నారు. హిందువులు, ముస్లింలు కలిసి ఉండలేరని పాకిస్తాన్‌లో అన్న మాటలను ఈ రోజు కశ్మీర్‌లో టెర్రరిస్టు దాడుల ద్వారా రుజువు చేయాలని చూస్తున్నారన్నారు. ఉగ్రవాదంపై యావత్ భారతదేశం కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా, అమాయక ప్రజల ప్రాణాలు కోల్పోకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రాయితీతో వేరుశనగ, మినుము విత్తనాలు

లింగాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బోరుబావుల కింద పంటలు సాగుచేసే రైతుల కోసం ప్రభుత్వం వేరుశనగ, మినుము విత్తనాలను 50శాత రాయితీతో అందిస్తోందని వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వేరుశనగ 30కేజీల బస్తా రూ.2880 కాగా 50శాతం రాయితీతో రూ.1440తో పంపిణీ చేస్తామని, 4 కేజీల మినుములు రూ.560 కాగా రాయితీ పోను రైతు రూ.280 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అవసరం ఉన్న రైతులు ఆయా రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలన్నారు.

వితంతు పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి

చెన్నూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భర్త పెన్షన్ పొందుతూ మరణించి ఉంటే వితంతువు అయిన భార్య అతని పింఛను పొందేందుకు అర్హురాలని, అలాంటి వారు పింఛను కోసం దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, తహసీల్దారు సరస్వతి తెలిపారు. చెన్నూరులో గురువారం వారు మాట్లాడుతూ 2023 డిసెంబరు 1 నుండి 2024 అక్టోబరు 31 వరకు పెన్షన్ పొందుతూ భర్తలు చనిపోయిన మహిళలు ఈ పింఛను పొందేందుకు అర్హులని తెలిపారు. అయితే 60 ఏళ్ల వయస్సు పైబడిన మహిళల పింఛన్‌కు ఇంకా ఆప్షన్ రాలేదన్నారు. కేవలం ఈ 11 నెలల కాలంలో భర్తలు చనిపోయిన వారు మాత్రమే అర్హులని వారు తెలిపారు. అర్హులైనవారు సచివాలయంలో కానీ, రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

సారా కేసులో పట్టుబడ్డ వాహనాలకు వేలం

కడప క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలకు సంబంధించి వేలంపాటను ఈనెల 26న ఉదయం 11గంటలకు కడప ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కడప సీఐ కృష్ణకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు ఈ వేలంపాటలో పాల్గొని వాహనాలు కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల్లో ఇయర్ ప్యాటర్న్ విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలో యోగివేమన యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ ఇయర్ ప్యాటర్న్ విద్యార్థులు బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు పెండింగ్‌లో ఉండడంతో పై చదువులు చదవలేక ఇబ్బందులు పడుతున్నారని, వీరి భవిష్యత్ దృష్ట్యా మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇన్‌పుట్ డీలర్లు బాధ్యతగా పనిచేయాలి

సీకేదిన్నె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇన్‌పుట్ డీలర్లు బాధ్యతగా పనిచేయాలని వ్యవసాయ పరిశోధన స్థానం తిరుపతి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆచార్య ఎన్జీరంగ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జేసీ ప్రోగ్రాం ద్వారా ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు బ్యాచ్‌ల్లో మొత్తం 80 మంది డీలర్లకు సంవత్సరం పాటు డిప్లమో ప్రోగ్రాం శిక్షణ అందించడం జరిగిందని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని రైతులకు తగిన సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాట్ సెంటర్, కేవీకే కోఆర్డినేటర్లు అంకయ్యకుమార్, వీరయ్య, ఆత్మా పీడీ విజయలక్ష్మి, డీపీడీ పద్మలత, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడ కాంగ్రెస్ సమావేశానికి జిల్లా నేతలు

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఏ-1 ఫంక్షన్ హాలులో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి నిర్వహించే సమావేశానికి జిల్లా నుండి పీసీసీ ప్రత్యేక అధికార ప్రతినిధి తులసిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి, నగర అధ్యక్షుడు తదితరులు హాజరు కానున్నట్లు డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పర్యాటకులను హతమార్చడం దారుణం

● పాక్‌ను ఉగ్రవాద ప్రేరేపిత దేశంగా ప్రకటించాలి ● పలుచోట్ల నిరసన ర్యాలీలు

కడప మారుతీనగర్/కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యటిస్తున్న అమాయక హిందువులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రమూక విచక్షణా రహితంగా కాల్పులు జరిపి హతమార్చడం దారుణమని జనసేన పార్టీ జిల్లా నాయకుడు జి.వి.రమణ అన్నారు. మృతులకు సంతాపంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల పాటు చేపట్టిన నిరసన కార్యక్రమాలలో భాగంగా గురువారం కడపలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అశాంతి సృష్టించాలనే ఏకైక లక్ష్యంతో అమాయక పర్యాటకులను పొట్టనపెట్టుకోవడం అత్యంత పైశాచిక చర్యగా అభివర్ణించారు. ఉగ్రవాదం పీచమణచే విధంగా కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అంబేడ్కర్ సర్కిల్‌లో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సీపీఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రవీంద్రబాబు, గజ్జెల సాయి, బసెట్టి సాయిస్వరూప్, గోపీ, విజయ్, భరత్, ఉపేంద్ర, బాలాజీ, వినయ్, తేజబాబు, రాజు, ప్రదర్శన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మనోహర్, నగర కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, శివకుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.



పులివెందులలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు, పట్టణ ప్రజలు

చెన్నూరులో కొవ్వొత్తులతో ర్యాలీ

చెన్నూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో హిందువులపై జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసన హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. స్థానిక రామాలయం నుండి స్టేట్‌బ్యాంకు మీదుగా కొత్తరోడ్డు వరకు జరిగిన ఈ ర్యాలీలో మండలంలోని అన్ని గ్రామాల హిందూ ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షుడు జీఎన్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పాకిస్తాన్‌ను ఉగ్రవాద దేశంగా భావించాలని డిమాండ్ చేశారు. అనంతరం కొత్తరోడ్డులో పాకిస్తాన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఎస్‌ఐలు తులసీ నాగప్రసాద్, ఎస్‌కే హుసేన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఉగ్రవాద దాడి హేయమైన చర్య

పులివెందుల టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ పహల్గాంలో చోటు చేసుకున్న ఉగ్రవాద దాడి అత్యంత హేయమైన చర్య అని హిందూ ఐక్యవేదిక, బీజేపీ, టీడీపీ, వైసీపీ, వివిధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పులివెందులలోని పాతబస్టాండు నుంచి పూలంగళ్ల వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పూలంగళ్ల వద్ద మానవహారంగా ఏర్పడి మృతులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హిందువులు, ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్, అన్ని పార్టీల నాయకులు, స్వచ్ఛంద సేవ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఉచిత కోచింగ్ డీఎస్సీ అభ్యర్థులకు వరం

● కడప ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ డీఎస్సీ అభ్యర్థులకు వరం లాంటిదని ఉప విద్యాధికారి జి.రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో జరిగిన డీఎస్సీ ఉచిత కోచింగ్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కేవలం 45రోజులు మాత్రమే పరీక్షలకు సమయమున్న పరిస్థితులలో డీఎస్సీ అభ్యర్థులు, ఆశావహులు కోచింగ్ కోసం వేలాది రూపాయలను వెచ్చిస్తూ, సుదూర ప్రాంతాలకు తరలివెళ్లాల్సిన అవసరం లేకుండానే యూటీఎఫ్ భవన్‌లో ఉచితంగా కోచింగ్ ఇవ్వడం అభినందనీయమన్నారు. డీఎస్సీ అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఆత్మస్థైర్యంతో ముందుకు వెళితే అద్భుత ఫలితాలను పొందవచ్చన్నారు. అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబులు మాట్లాడారు. డీఎస్సీ కోచింగ్ నందు శిక్షణ ఇచ్చే అధ్యాపకులు బ్రహ్మయ్య, కోవెల ప్రసాదరెడ్డి, కె.సత్యానందరెడ్డి,సుబ్బారెడ్డి, శ్రీనివాసులు,మహేష్, ప్రభాకర్, జి.గోపీనాథ్, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.సుదర్శన్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాతరాణి, జిల్లా కార్యదర్శులు ఎస్.ఎజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.కృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కేదార్‌నాథ్, శంకర్‌రెడ్డి, ప్రకాష్‌బాబు, శివశంకర్, శివకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కడప ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి

టపాసుల గిడ్డంగుల నిర్వహణలో జాగ్రత్తలు తప్పనిసరి

చెన్నూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): టపాసుల గిడ్డంగులు నిర్వహించేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దారు సరస్వతి, కడప ఫైర్ అధికారి బసిరెడ్డి అన్నారు. చెన్నూరు కొత్తరోడ్డు ప్రాంతంలోని టపాసుల గోడౌన్‌ను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్ యజమానికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రస్తుత వేసవిలో ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో గోడౌన్ల వద్ద అన్నిరకాల రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే 18 సంవత్సరాల్లోపు పిల్లలను గోడౌన్లలో బాలకార్మికులుగా నియమించరాదన్నారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసరు శ్రీనివాసులరెడ్డి, ఆర్ఐ కౌశిక్, ఏఎస్ఐ జాకీర్‌హుసేన్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కొన్ని బీఈడీ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయన్నారు. యూనివర్సిటీ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

అన్నదానం పుణ్యకార్యం

కడప కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అన్నదానం పుణ్యకార్యమని హిమవర్షిణి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గుండ్లకొండ విజయలక్ష్మి అన్నారు. యమ్మనూరు ఇందిరా ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రకాష్‌నగర్‌లోని ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు.

జిల్లా వ్యాప్తంగా జోరుగా కార్డెన్ సెర్చ్

కడప క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో గురువారం తెల్లవారుజామున కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో రికార్డులు లేని 51 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. బుధ, గురువారాల్లో నిర్వహించిన కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లలో రికార్డులు లేని మొత్తం 108 ద్విచక్ర వాహనాలు, ఆరు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత నేరస్తులు, అనుమానితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా అనుమానితులుంటే డయల్ 100 ద్వారా పోలీసుశాఖకు సమాచారం అందించాలన్నారు. కడప సబ్ డివిజను పరిధిలో బిస్మిల్లానగర్ కార్డెన్ సెర్చ్‌లో నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కడప టూటౌన్ సీఐ బి.నాగార్జున, ఎస్ఐలు హుసేన్, సిద్దయ్య, రాజరాజేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జమ్మలమడుగు, కడప సబ్ డివిజనులో, పెండ్లిమర్రి పీఎస్ పరిధిలో, మైదుకూరు సబ్ డివిజను పరిధిలో, పులివెందుల సబ్ డివిజన్ల పోలీసుస్టేషన్ల పరిధుల్లో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదు : ఆర్టీసీ ఆర్ఎం


కడప మారుతీనగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలో ఉన్న అన్ని డిపోలలో పైస్థాయి నుండి క్రింది స్థాయి ఉద్యోగులుగా సేవలందించే తోటి మహిళా ఉద్యోగుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు పాల్పడినా, అటువంటి వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తమ విధులను క్రమశిక్షణ, అంకిత భావంతో నిర్వర్తించాలని, ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు.

ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి

● ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బదిలీల చట్టం ద్వారా చేపడుతున్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు పూర్తయ్యే వరకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమగ్ర సమాచారం నిమిత్తం ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు తెలిపారు. గురువారం రిమ్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల నిర్ధారణలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా కేటగిరీల వారీగా వెబ్‌సైట్‌లో ఉంచాలన్నారు. అలాగే రిమ్స్‌లో వైకల్య నిర్ధారణ పరీక్షలు జరుగుతున్న కారణంగా ఉపాధ్యాయులు ఎటువంటి అసౌకర్యానికి గురకాకుండా ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామకృష్ణంరాజు, జిల్లా ఆర్థిక కార్యదర్శి చలపతిరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిక



తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరిన తిరుపాల్‌రెడ్డి

పులివెందుల రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పులివెందుల అసెంబ్లీ కమిటీ సభ్యుడు తిరుపాల్‌రెడ్డి తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. గురువారం ఆయన స్వగృహంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ భానుప్రకాష్, అసెంబ్లీ కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి తదితర బీజేపీ, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ సవరణ బిల్లు ఆమోదం దుర్మార్గమైన చర్య

● మాజీ ఎమ్మెల్సీ, ఎస్టీయూ నేత కత్తి నరసింహారెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ అమలు కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులందరు పోరాటం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం పింఛన్ సవరణ బిల్లు గుట్టుచప్పుడు కాకుండా లోక్‌సభలో ఆమోదింపచేసుకోవడం దుర్మార్గమైన చర్య అని మాజీ ఎమ్మెల్సీ, ఎస్టీయూ నాయకుడు కత్తి నరసింహారెడ్డి అన్నారు. వేంపల్లెలోని చైతన్యనగర్‌లో గురువారం ఎస్టీయూ చక్రాయపేట, వేంపల్లె, మండలాల రీజియన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ పాత పింఛన్ విధానాన్ని అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయు బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాష, ప్రధాన కార్యదర్శి ఇలియాస్ బాష, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్‌బాబు, రమణారెడ్డి, ఆదినారాయణరెడ్డి, శివారెడ్డి, రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కత్తి నరసంహారెడ్డి

పంచాయతీరాజ్ వ్యవస్థతో గ్రామాలు మరింత పటిష్టం

చెన్నూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల పటిష్టతకే పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటైందని ఈవోఆర్‌డీ సురేశ్‌బాబు అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా చెన్నూరు గ్రామ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1993 ఏప్రిల్ 24న 73వ రాజ్యాంగ సవరణ చట్టం అమలులోకి వచ్చిందని, దీని ద్వారా 29 అంశాలపై పంచాయతీలకు అధికారాలు కల్పించడం జరిగిందన్నారు. మూడంచెల వ్యవస్థ, మహిళలకు 1/3వ వంతు రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లు ఈ పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా కల్పించడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా ప్రజలకు అన్నిరకాల మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

చెన్నూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదిరోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఉప్పరపల్లె గ్రామప్రజలు కోరారు. పంచాయతీరాజ్ దినోత్సవ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. మనుషులంటే నాలుగు బిందెలు నీళ్లు తెచ్చుకుని సరిపెట్టుకుంటారని, కానీ ఇంటింటికీ పశువులుండటంతో వాటి పరిస్థితి ఏమిటంటూ ఉప్పరపల్లె గ్రామ ప్రజలు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వర్‌రెడ్డిని ప్రశ్నించారు. బీసీ కాలనీలోని ఓ ప్రధాన వీధిలో పదిరోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదని వాపోయారు. ఏఈ వెంటనే స్పందించి పైపులైను సమస్య ఏదైనా ఉంటే పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అన్వర్‌బాషా, వార్డుసభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

'వల్లూరును అన్నిరంగాల్లో అభివృద్ధిపరుస్తాం'

వల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వల్లూరు గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచేందుకు ఒక ప్రణాళికతో ముందుకు సాగుతామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. గురువారం పంచాయతీదివస్ కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లూరులో పరిశుభ్రతతో పాటు తాగునీటి కొరత లేకుండా అన్నిరకాల ప్రణాళికలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే సిమెంటు రోడ్లు, డ్రైనేజీ, ఇతర పంచాయతీ అవసరాలకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్పీ నాగలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, ఎమ్మార్పీ నాగమణి పాల్గొన్నారు.

అధికారాలు లేక నిర్వీర్యమైన పంచాయతీలు

●తులసిరెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ, టీడీపీ కూటమి ప్రభుత్వాల పాలనలో గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు విధులు, నిధులు లేక నిర్వీర్యమై ఉత్సవ విగ్రహాలుగా తయారయ్యాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికారప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి మండిపడ్డారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణచట్టం ద్వారా గ్రామ పంచాయతీలకు, మండల, జిల్లా పరిషత్తులకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించిందన్నారు. రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్ కింద వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, గ్రామీణ మౌలిక సదుపాయాలు,ప్రాథమిక, మాధ్యమిక విద్యఆరోగ్యం, పారిశుధ్యం, దారిద్ర్య నిర్మూలన పథకాలు, బలహీన వర్గాల సంక్షేమం, ప్రజాపంపిణీ వ్యవస్థ, గ్రామీణ ఇళ్ల నిర్మాణం, తాగునీరు, గ్రామీణ విద్యుదీకరణ తదితర 29 అంశాలు పంచాయతీరాజ్ సంస్థలు నిర్వహించాలన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆ అధికారాలు బదలాయించలేదన్నారు. ఇప్పటికైన రాజ్యాంగం ప్రకారం పంచాయతీ రాజ్ సంస్థలకు బదలాయించాల్సిన 29 అంశాలను వెంటనే బదలాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

పంచాయతీరాజ్ వ్యవస్థతో గ్రామాల అభివృద్ధి

లింగాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పడడంతో గ్రామాలలో అభివృద్ధి సాధ్యమైందని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. లింగాల ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఓ లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తా చాటిన న్యూ హారైజన్ విద్యార్థులు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రమేష్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అగాడి వీధిలో ఉన్న న్యూ హారైజన్ హైస్కూలు విద్యార్థులు పదో తరగత పరీక్షల్లో సత్తా చాటారని ఆ పాఠశాల కరస్పాండెంట్ రమేష్‌రెడ్డి తెలిపారు. ఎస్.రోషన్ జియా 590, ఎస్.సమీహ నఫీసా 586, సాద యా తీస్కిన్ 584 మార్కులతో పాటు మొత్తం 23 మంది 500పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ విజయానికి తోడ్పడిన పాఠశాల ఉపాధ్యాయులను, విద్యార్థులను, తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

శాంతినికేతన్ పాఠశాల విద్యార్థుల విజయం



శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాలలో కడప నగరం శాంతిని కేతన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల వ్యవస్థాపకుడు ఏలియాస్‌రెడ్డి తెలిపారు. సి.జ్ఞాన ప్రదీప్తి 579, సి.యాసస్వి అరుణ 576, జె.మునిసాయిలిఖిత 574 మార్కులు సాధించారన్నారు. ఆరుగురు విద్యార్థులు 550పైగా, 500పైన మార్కులను 12 మంది సాధించారన్నారు.

పదిలో పవన్ విద్యార్థుల ప్రభంజనం

కడప ఎడ్యుకేషన్,ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పది పరీక్ష ఫలితాలలో పవన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని పాఠశాల కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి తెలిపారు. ఎం.స్రవంతి 596మార్కులు, టి.స్నేహలత 594, ఎస్.మాలిక్ బాష 588, ఎస్.హర్ష మణికంఠ 586, బి.వెంకటయశ్విత 585మార్కులతో పాటు 20 మందికి పైగా 550పైగా మార్కులు సాధించడమే కాకుడా వందశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.



విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతున్న లెక్కల జోగిరామిరెడ్డి

వేతనదారులకు పనులు కల్పించాలి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధిలో వేతనదారులకు పనులు కల్పించాలని ఏపీడీ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండల ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామపంచాయతీలోనూ వేతనదారుల కు పనులు కల్పించాలన్నారు.

పదిలో విశ్వజ్యోతి ప్రభంజనం



పదిలో ప్రతిభ కనబరచిన విద్యార్థినీ, విద్యార్థులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని విశ్వజ్యోతి పాఠశాల పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనపరిచినట్లు విశ్వజ్యోతి హైస్కూలు కరస్పాండెంట్ మారెడ్డి తెలిపారు. పదవ తరగతిలో జి.అమృత 595 మార్కులు, ఎస్.చంద్రకాంతరెడ్డి 592 మార్కులు, టి.నివేదిత 591, వై.లక్ష్మీశ్రీజ 590, ఎం.సుశ్మిత 590 మార్కులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ మారెడ్డి, డైరెక్టర్ పరిమళ, ప్రిన్సిపల్ గురుకిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థులకు గురువారం పాఠశాలలో అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కొత్తపల్లె పొలానికి హద్దులు చూపించండి



ధర్నా నిర్వహిస్తున్న ఏపీ వ్యవసాయ కార్మికసంఘం నేతలు

బద్వేలు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.కొత్తపల్లె సర్వే నెంబరు 55లో 4 ఎకరాల 73 సెంట్లు పొలానికి హద్దులు చూపించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఆమేరకు స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం బద్వేలు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు .ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ ఈ పొలంలో 55 ఎకరాల 73 సెంట్ల భూమికి గాను కేవలం రెండు ఎకరాలు మాత్రమే కనపడుతోందని,మిగతా భూమి ఏమైందని ఆయన ప్రశ్నించారు. దీనిని కబ్జా చేసిన వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సరస్వతి, పుష్ప మరియమ్మ, బేబి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ యూడీ ఆర్ఐ గా రమేశ్

ప్రొద్దుటూరు,ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):ప్రొద్దుటూరు మున్సిపల్ యూడీఆర్ఐగా రమేశ్‌ను నియమిస్తూ మున్సిపల్ కమిషనర్ మల్లికా ర్జున గురువారం ఆదేశాలిచ్చారు. రమేశ్‌కు రెవెన్యూ సెక్షన్ ఏ1 క్లర్క్ సీటు తోపాటుగా 14, 16, 17, 18, 19, 22, 23, 25, 26, 27 రెవెన్యూ వార్డులను కేటాయించారు. లోయర్ డివిజన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అయిన కె శివచరణ్‌రెడ్డికి గతంలో ఉన్న ఈ వార్డులన్నీ తొలగిస్తూ తక్కిన 1నుంచి 13, 15, 20, 21 వార్డులను కేటాయించారు. దీనికి తోడు ఆర్‌టీఐ యాక్ట్ సీటును అదనంగా కేటాయించారు. రమేశ్‌కు కేటాయించిన వార్డుల చార్జ్ లిస్టును శివ చరణ్ రెడ్డి అప్పగించాలని ఆ ఉత్తర్వుల్లో కమిషనర్ పేర్కొన్నారు.

ఉగ్రవాదాన్ని అణచివేయాలి



ప్రొద్దుటూరులో ఏర్పాటు చేసిన మానవహారం



మైదుకూరులో న్యాయవాదుల నిరసన



జమ్మలమడుగులో జనసేన కార్యకర్తల నిరసన

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు సి.నాగార్జున పేర్కొన్నారు. జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం టీఆర్ఎఫ్ ఉగ్రవాద సంస్థ 29 మంది అమాయకులను హతమార్చడానికి నిరసనగా గురువారం సాయంత్రం హిందూ సంఘాల ఆధ్వర్యంలో శివాలయం సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదులు అమాయక ప్రజలపై దాడి చేయడం పిరికిపంద చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకుడు మల్లి కార్జునరావు, బీజేపీ పట్టణాధ్యక్షుడు నరేంద్ర, జింకా మార్కండేయ, ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బుశెట్టి రామమోహన్‌రావు, టీవీ సురేష్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ సభ్యులు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, చలపతి, జనసేన నాయకుడు మాదాసు మురళి, వీహెచ్‌పీ, హిందూ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఉగ్రవాదులది పిరికిపంద చర్య

జమ్మలమడుగు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లో పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య అని జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర పేర్కొన్నారు. గురువారం జమ్మలమడుగు జనసేన పార్టీ కార్యాలయం ఎదుట శాంతియుతంగా నల్లబ్యాడ్జీలు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం జనసేన రాయలసీమ జోన్ డాక్టర్స్ సెల్ కార్యదర్శి డాక్టర్ నల్లంశెట్టి నాగార్జున, జనసేన కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో జనసేన నాయకులు జి.రమణ, శ్రీరాంవంశి, నవీన్‌కుమార్, కిశోర్, క్రిష్ణయ్య, సుబ్బరాయుడు, వెంకటేష్, సుధాకర్, మహ్మద్‌వలి పాల్గొన్నారు. అ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జమ్మలమడుగు అంబేడ్కర్ విగ్రహం ఎదుట కొవ్వొత్తులతో నిరసన తెలిపి మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిచికెబాబు, చిన్నయ్య నాగరాజు, ఓబయ్య, ఓబులేసు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు, మెడికల్, రిటైల్, హోల్‌సేల్ వ్యాపారస్తులు వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం వద్ద నుంచి శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి అత్యంత దుర్మార్గం

బద్వేల్‌టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కాశ్మీర్‌లోని పహల్గాంలోని పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి అత్యంత కిరాతకంగా కాల్చిచంపడం దుర్మార్గమైన చర్యఅని ఉపాధ్యాయసంఘాల ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం బద్వేలులోని బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండుమీదుగా నాలుగురోడ్ల కూడలి వరకు ఉపాధ్యాయసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చింతంరెడ్డి రామచంద్రా రెడ్డి, ఆవుల వెంకట్, అంకయ్య, వెంకటసుబ్బయ్య, తిరుపాల్ పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద చర్యలను ఖండిస్తూ గురువారం పోరుమామిళ్లలో అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలు కొవ్వొత్తులతో నిరసన చేశారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ రాజీవ్‌బాషా, సెక్రటరీ హబీబ్, సీఎంబాషా, దాదాపీర్, గఫార్, ముత్యాల ప్రసాద్, మోఘల్ జిలానీ, హసన్‌లతో పాటు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు. అలాగే అంబేద్కర్ సర్కిల్ వద్ద జనసేన ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. రామ్మోహన్, రమణయ్య, కె.వెంకటేశ్ నాయకులు పాల్గొన్నారు.

మైదుకూరులో న్యాయవాదుల నిరసన ర్యాలీ

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) :కాశ్మీర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ మైదుకూరు బార్ అసోషియేషన్ న్యాయవాదులు నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక న్యాయవాదులు గురువారం రాయల్ కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో న్యాయవాదులు దాసరిబాబు, జ్వాలా నరసింహ, బాలవెంకటయ్య, నాగిరెడ్డి, అబ్దుల్లా, కామనూరు శ్రీనివాసులు, శివరాం పాల్గొన్నారు.

ఖాజీపేటలో: ఉగ్రవాదులు హిందువులను చంపడం దారుణమని, ఇలాంటి వారిని అంతం చేయాలని ఖాజీపేటలో శాంతియుత ర్యాలీ నిర్వహించి కూడలిలో మానవహారం నిర్వహించారు. వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి, మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మోహన్‌రెడ్డి, డి.శ్రీనివాసులరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా సెక్రటరీ

కొండాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొండాపురంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సెక్రటరీ అమీరుద్దీన్ గురువారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని ఫైళ్లను, రికార్డులను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పలు సమస్యలను లైబ్రరీయన్ వరలక్ష్మీ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్యను పెంచాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలి

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ రూల్స్ అధిగమించి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని డీఎస్పీ భావన తెలిపారు. గురువారం స్థానిక కొత్తపల్లె సర్కిల్ వద్ద రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ వెంకటసురేష్‌లతో కలిసి వాహనాల తనిఖీలో డీఎస్పీ పాల్గొన్నారు. ఈసందర్భంగా వాహనదారులతో డీఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్‌తో ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. కొత్తట్రాఫిక్ రూల్స్‌ను అనుసరించి నడుచుకోవాలన్నారు. లైసెన్సులతో అన్ని రకాల ధృవపత్రాలను తనిఖీల సమయంలో వాహనదారులు చూపాలన్నారు.

వృత్తి విద్యా కోర్సుల సర్టిఫికెట్లు పంపిణీ

బద్వేలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వృత్తి విద్యాకోర్సులైన ఐటీ, ఐటీఈఎస్‌కు సంబంధించి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ సునీత సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఒకే షనల్ ట్రైనర్ ఆర్. శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

గూడుమస్తాన్‌వలి ఉరుసు ప్రారంభం

జమ్మలమడుగు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పెన్నానది వద్దున వెలసిన హజరత్ సయ్యద్‌షా గూడు మస్తాన్‌వలి ఉరుసు మహోత్సవం గురువారం షేక్ మహమ్మద్ అక్బార్ ఇంటి నుంచి నిషాన్ దర్గాకు చేరడంతో ప్రారంభమైంది. 25 శుక్రవారం గంధం, 26న శనివారం రాత్రి వైభవంగా ఉరుసు మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు దర్గా అధ్యక్షుడు ముల్లాజానీ, కమిటీ ఉపాధ్యక్షుడు షబ్బీర్, కమిటీ సభ్యులు తెలిపారు.

ముద్దనూరులో కార్డెన్ సెర్చ్

ముద్దనూరు ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ఎస్వీగిరి కాలనీ, ఎల్ఎం కాంపౌండ్‌లో గురువారం కార్డన్ సెర్చ్‌లో భాగంగా పోలీసులు తనిఖీ చేశారు. ముద్దనూరు సీఐ దస్తగిరి, ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు, కొండాపురం సీఐ మహమ్మద్ రఫీల ఆధ్వర్యంలో దాదాపు 30 మంది పోలీసులు తనిఖీలు నిర్వహించారు.ఇంటింటికీ వెళ్లి సోదాలు చేశారు. 34 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు.

వైద్యుల సలహాలు పాటించాలి

ఖాజీపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ రైతులు వైద్యుల సలహాలు పాటించితే అధిక పాల ఉత్పత్తి సాధించవచ్చని జేడీ శారదమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని సన్నపల్లె పంచాయతీలో పశువైద్య కళాశాల విద్యార్థులు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా 320 పశువులకు, జీవాలకు చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు వేణుగోపాల్‌రెడ్డి, డీడీ రమణయ్య, ఏడీ రాజశేఖర్, పశువైద్య అధికారులు బాబు రామచంద్ర, సురేంద్ర, యుగంధర్, రాయలరెడ్డి, విద్యాసాగర్, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనపరచిన ఆర్యవైశ్య విద్యా ర్థులకు పోరుమామిళ్ల వాసవీ క్లబ్ తరఫున ముగ్గురికి గురువారం నగదు బహుమతులు అందించారు. వాసవీ క్లబ్ తరఫున దుబాయ్ వాసవీ క్లబ్ కన్వీనరు నూకల మురళీక్రిష్ణ చేతుల మీదుగా బహుమతులు అందించారు వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ ఎం.శివకుమార్, కార్యదర్శి జి.పవన్‌కుమార్, ట్రెజరర్ పద్మనాబయ్య, సంఘం అధ్యక్షులు విశ్వనాధుల ప్రసాద్, వాసవీ క్లబ్ వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అన్నపై తమ్ముడి దాడి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) :తనకు బాకీ ఉన్న రెండు లక్షల రూపాయలను అడిగినందుకు అన్న శివపై తమ్ముడు ప్రసాద్ కొడవలితో దాడిచేశాడు. జిల్లెల్ల గ్రామానికి చెందిన శివకు అతని తమ్ముడు రెండు లక్షలు బాకీ ఉన్నాడు. ఈ విషయమై తమ్ముడిని డబ్బులు ఇవ్వమని కోరగా అతను దాడిచేశాడు. దీంతో కుటుంబ సభ్యులు గాయపడిన శివను కడప రిమ్స్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

సోలార్ భూములు పరిశీలించిన ఆర్డీవో



పొలాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో

పెద్దముడియం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కల్వటాల, నాగిరెడ్డిపల్లె గ్రామాల పరిధిలో సోలార్ భూములను గురువారం ఆర్డీవో సాయిశ్రీ పరిశీలించారు. కల్వటాల గ్రామంలో ఇప్పటికే సుమారు 800 ఎకరాల్లో సోలార్‌పనులు జరుగుతున్నాయి. దీంతో పాటు మరికొంత భూమిలో కూడా పనులు ప్రారంభించేందుకు సోలార్ ప్రతినిధులు అధికారులు, ఆ గ్రామ రైతులతో చర్చలు జరుపుతున్నారు. అలాగే నాగిరెడ్డిపల్లె గ్రామ పరిధిలో సుమారు 500 ఎకరాల భూమి తమకు కావలంటూ సోలార్ ప్రతినిధులు కోరగా జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సాధ్యాసాధ్యాల విషయ మై ఆర్డీవో ఆ భూములు పరిశీలించారు. అయితే నాగిరెడ్డిపల్లె గ్రామ పరిధిలోని పొలం తమ గ్రామానికి అవసరమని, మూగజీవాల మేతకు కావాలని ఆ గ్రామ రైతులు ఆర్డీఓ, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో ఈ భూములు పరిశీలించారు. అలాగే కల్వటాల గ్రామంలో గతంలో డీకేటీ పట్టాలు ఇచ్చిన భూములకు పరిహారం ఇచ్చి సోలార్ పనులు చేపట్టాలని రైతులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. రెండు గ్రామాల పరిధిలో పర్యటించిన ఆర్డీవో సోలార్ కంపెనీ ప్రతినిధులు దరఖాస్తులు ఆయా గ్రామాల ప్రజల ఫిర్యాదులు పరిగణనలోకి తీసుకుని తుది నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు సమాచారం. కార్యక్రమంలో తహసీల్దారు బాలనరసింహులు, ఇతర రెవెన్యూ అధికారులు, సోలార్ కంపెనీ ప్రతినిధులు, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

కౌలు వేలం ద్వారా రూ.9.50లక్షలు ఆదాయం



సోమేశ్వరాలయంలో భూముల కౌలు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

రాజుపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టంగుటూరు గ్రామంలో వెల సిన సోమేశ్వరస్వామి దేవాలయం భూముల కౌలు వేలం ద్వారా రూ.9.50 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కె.రామచంద్రచార్యులు తెలిపారు. గురువారం సదరు ఆలయ మండపంలోని బహిరంగ వేలం పాట నిర్వహించారు. టంగుటూరు గ్రామ పొలంలోని 178.59 ఎకరాలు భూమికి ఒక ఏడాది పాటు కౌలు సాగు చేసుకునేందుకు వేలం పాట నిర్వహించారు. దేవదాయశాఖ ప్రొద్దుటూరు డివిజను ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కు మార్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ వేలం పాట జరిగింది. టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సహకారంతో గ్రామంలోని వేలం పాట నిర్వహించడంతో గత ఏడాది రూ.8.50లక్షలు, ఈ సంవత్సరం రూ.9.50లక్షలు ఆదాయం వచ్చినట్లు చర్చించుకుంటున్నారు. గతంలో వేలం పాట ప్రొద్దుటూరులో నిర్వహించేంటప్పుడు రూ.4లక్షల కంటే మించకుండా ఆదాయం వచ్చేది. ఈ వేలంపాటలో దాదాపు 56 మంది పాటదారులు ఒక్కొక్కరు రూ.10వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనగా 35 మంది పాటదారులు ఈభూములు కౌలుకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ రంగేశ్‌రెడ్డి, పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు.

మైలవరం జలాశయానికి గండికోట నీరు నిలిపివేత

కొండాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి గురువారం అధికారులు నీరు నిలుపుదల చేశారు. మైలవరం ప్రాంతం రైతుల అవసరాల దృష్ట్యా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం నుంచి ఒక టీఎంసీ నీటిని విడుదల చేసి, ప్రస్తుతం నీటిని నిలుపుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా గండికోట నుంచి పైడిపాలెం రిజర్వాయిర్‌కు, సర్వరాయసాగర్‌కు 300 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదలవుతోందన్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 18.8 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

ఆ పింఛన్లకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి

కొండాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య పింఛను డిసెంబరు 1, 2023 నుంచి అక్టోబరు 31 , 2024 వరకు తీసుకుంటూ మరణించిన వారి భార్యలకు పింఛను దరఖాస్తు చేయాడానికి ఆప్షన్ రావడం జరిగిందని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. ఈ మధ్య కాలంలో మృతి చెందినవారు ఎవరైనా ఉంటే వారి భర్త డెత్‌సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు తీసుకెళ్లి సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు. ఈ మధ్యకాలంలో మండలంలో 83 మంది పింఛన్లు తీసుకుంటూ మృతి చెందినట్లు గుర్తించామని ఆయన తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించండి

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చెన్నంరాజుపల్లె మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు ఇచ్చే ఆస్తి చదువేనన్నారు. ఎంఈవో సావిత్రమ్మ మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం నుంచి పాఠశాల జడ్పీ హైస్కూలుగా అప్‌గ్రేడ్ అయిందని,తెలిపారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ వెంకటసుబ్బయ్య, బలరాముడు, హౌసింగ్ ఎంప్లాయీస్ సొసైటీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, హెచ్ఎం సుబ్రమణ్యం, ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.